జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 118 | హైదరాబాద్, జులై 12 బుధవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

## వీఆర్ఏల సర్దుబాటుపై..

# చర్చలకు మంత్రివర్గ ఉప సంఘం..!

## సీఎం కేసీఆర్ కీలక ఆదేశాలు..!



హైదరాబాద్: వీఆర్ఏల సర్దుబాటుపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. వీఆర్ఏల విద్యార్హతలు, సామర్థ్యాన్ని బట్టి ఇరిగేషన్‌తో సహా ఇతరశాఖల్లో సర్దుబాటు చేసి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వీఆర్ఏలతో సమావేశమై, చర్చించి వారి అభిప్రాయాలను సేకరించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకు మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్‌లతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రివర్గ ఉప సంఘం వీఆర్ఏలతో బుధవారం నుంచి చర్చలు ప్రారంభించనున్నది. చర్చల అనంతరం ఉప సంఘం సూచనల ప్రకారం.. నిర్ణయాలు తీసుకోని వీఆర్ఏల సేవలను వినియోగించుకునే దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఉప సంఘం కసరత్తు, నివేదిక సిద్ధమయ్యాక తర్వాత మరోమారు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం కేసీఆర్ తెలిపారు. ఈ ప్రక్రియ వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## సైఫాబాద్ లో మాస్టర్ కీ టివి ఛానల్

# విలేకరుల శిక్షణా తరగతులు...




(వివరాలు 3లో..)

# మోదీ సర్కారుకు మొట్టికాయలు..

## ఈడీ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు అక్రమమన్న సుప్రీం



న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈడీ డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం మూడోసారి పొడిగించడాన్ని దేశ సర్వోన్నత న్యాయస్థానం తప్పుపట్టింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు అక్రమమంటూ మోదీ సర్కారుకు మొట్టికాయలు వేసింది. ఈ మేరకు జస్టిస్ బీఆర్ గౌరవ్, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వును కొట్టిపారేసింది. అంతేగాక, ఈ నెల 31న సంజయ్ కుమార్ మిశ్రా ఈడీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాలని కోర్టు ఆదేశించింది. ఈలోగా ఈడీ నూతన డైరెక్టర్ నియమకాన్ని పూర్తి చేయాలని కేంద్రానికి సూచించింది. దాంతో సంజయ్ మిశ్రా ఈ నెల 31న తన పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం ఏర్పడింది. లేదంటే కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ ఏడాది నవంబర్ 18 వరకు సంజయ్ మిశ్రా ఈడీ డైరెక్టర్‌గా కొనసాగేవారు. ఈ తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి మరో విషయాన్ని కూడా స్పష్టం చేసింది. సీబీఐ, ఈడీ డైరెక్టర్‌ల నిర్ణాయక రెండేళ్ల పదవీకాలం పూర్తయ్యాక మరో మూడేళ్లపాటు వారి పదవీకాలాలను పొడిగించేలా కేంద్ర ప్రభుత్వానికి అధికారాలను కట్టబెట్టిన చట్టాలకు సవరణలు జరిగిన విషయాన్ని సుప్రీంకరోర్టు గుర్తు చేసింది.



## సొంతం సెమీకండక్టర్ల యూనిట్‌ను నెలకొల్పనున్న ఫాక్స్‌కాన్..!

తైవాన్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఫాక్స్‌కాన్ భారత్‌లో సమీకండక్టర్ తయారీ యూనిట్‌ను ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నది. ఈ కోసం ప్రత్యేకంగా దరఖాస్తును దాఖలు చేయనున్నది. ఈ విషయాన్ని కంపెనీ మంగళవారం వెల్లడించింది. సెమీకండక్టర్లకు సంబంధించిన సవరించిన షెడ్యూల్‌పై పని చేస్తున్నామని, డిస్‌ప్లే ఫ్యాబ్ ఎకోసిస్టమ్ కోసం దరఖాస్తు చేయాలని యోచిస్తున్నట్లు కంపెనీ ప్రకటనలో పేర్కొంది. (మిగతా 2లో..)

# కాకరేపుతున్న 'ఉచిత విద్యుత్'..

### రేవంత్ మాటలకు భగ్గుమన్న బీఆర్ఎస్.. ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా మారబోతుందా?




తెలంగాణ రాజకీయాల్లో ఉచిత విద్యుత్‌పై కాకరేగుతోంది. సన్నకారు రైతులకు 3గంటలు ఉచిత విద్యుత్ చాలంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రత్యర్థులకు అస్త్రంగా మారితే.. సొంత పార్టీలోనూ రుసరుసలు మొదలయ్యాయి. రైతులకు ఉచిత విద్యుత్ ఎత్తేయడం కాంగ్రెస్ విధానమంటూ బీఆర్ఎస్ రోడ్డిపైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే.. కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడి కవరింగ్ పాలిటిక్స్ మొదలుపెట్టింది. అనూహ్యంగా వచ్చిన పవర్ ఇష్యూ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటలయుద్ధానికి తెరతీసింది.రైతులకు 3 గంటల కరెంట్ చాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బిఆర్ఎస్ భగ్గుమంటోంది. కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని గులాబీ నేతలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానం రేవంత్ మాటల్లో బయటపడిందన్నారు తెలంగాణ మంత్రులు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదన్న రేవంత్ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని BRS శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేకి అయిన చంద్రబాబు వారసులు ఇంకా తెలంగాణలో ఉన్నారనడానికి రేవంత్ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయన్నారు మరో మంత్రి జగదీష్‌రెడ్డి.ఉచిత విద్యుత్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లోనూ కలకలం రేగింది. అసలు ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పథకాన్ని కొనసాగిస్తామన్నారు. రేవంత్ రెడ్డి ఏ సందర్భంలో ఆ వ్యాఖ్యలు చేశారో కనుక్కుంటామన్నారు కోమటిరెడ్డి. అటు రేవంత్ వ్యాఖ్యలను కావాలని వక్రీకరిస్తున్నారని మరికొంతమంది పీసీసీ నేతలు అభిప్రాయపడుతున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని, ఆయన పీసీసీ అధ్యక్షుడిగా మాట్లాడారు కాబట్టి కాంగ్రెస్ తప్పించుకునే అవకాశం లేదని బీఆర్ఎస్ అంటోంది. ఆయన మాటలను వక్రీకరించి రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ అంటోంది.

# జీఎస్టీ సమావేశంలో మంత్రి హరీష్‌రావు..

### నిర్మలమ్మ దృష్టికి కీలక అంశాలు..



న్యూ ఢిల్లీలోని మంగళవారం విగ్యాన్ భవన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 50వ జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, వైద్య శాఖ మంత్రి టి.హారీష్ రావు పాల్గొన్నారు. ఈ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో హరీశ్‌రావుగారు పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణకు రావాల్సిన ఐజీఎస్టీ ఫండ్స్ ఇతర రాష్ట్రాలకు చెల్లించిన అంశాన్ని పరిష్కరించాలని, చాలా కాలంగా అడుగుతున్నా కొలిక్కిరాలేదని అన్నారు. ఉదాహరణకు మహారాష్ట్రకు చెందిన ఒక టాక్స్ పేయర్ రూ. 82 కోట్లు తెలంగాణకు చెల్లించాల్సి ఉంది. ఇదే విషయాన్ని ఆ టాక్స్ పేయర్ కూడా అంగీకరించారు. అయితే తనకు రీఫండ్ రాగానే చెల్లిస్తామని క్లారిటీ ఇచ్చారు. కానీ పెండింగ్‌లోనే ఉండిపోయిందని తెలిపారు.గతంలో జరిగిన 47వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే దీన్ని లేవనెత్తామని, ఆఫీసర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు హామీ లభించిందని, కానీ కార్యరూపం దాల్చలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటివరకూ ఈ విషయంలో ఎలాంటి చర్యలూ లేవని, అందువల్ల ఇలాంటి అంశాలను సత్వరం పరిష్కరించేందుకు గతంలో హామీ ఇచ్చినట్లుగా ఆఫీసర్ల బృందాన్నిగానీ లేదా గ్రూఫ్ ఆఫ్ మినిస్టర్స్ గానీ ఏర్పాటు చేయాలన్నారు. అయితే ఈ ప్రతిపాదనకు కేంద్ర ఆర్థిక మంత్రి సానుకూలంగా స్పందించారు.

# హిమాచల్‌లో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థులు..

### సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు



న్యూఢిల్లీ, : ఉత్తరాదిలో జలప్రళయాన్ని సృష్టించిన వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో చిక్కుకుపోయిన నలుగురు తెలుగు ఆర్కిటెక్ట్ విద్యార్థుల వ్యవహారంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఢిల్లీలోని 'స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్'లో చదువుకుంటున్న విద్యార్థులు స్టడీ టూర్‌తో పాటు విహార యాత్ర కోసం హిమాచల్ ప్రదేశ్ వెళ్లారు. ఆ బృందంలో నలుగురు విద్యార్థులు తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. పార్వతి వ్యాలీలోని కసోల్ గ్రామంలో ఉండగా చివరిసారిగా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ తర్వాత వారి ఫోన్లు అందుబాటులోకి లేకుండా పోయాయి. మరోవైపు వర్షాలు, వరదల ఉధృతి పెరిగి ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడ్డ వార్తలు, వరదల్లో భవనాలు, వాహనాలు కొట్టుకుపోతున్న దృశ్యాలను వార్తా ప్రసారాల్లో చూసిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లల ఆచూకీ తెలియడం లేదని, (మిగతా 2లో..)

జై భీమ్




రిజర్వేషన్స్ కావాలా....?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కావాలా....?
ఆలోచించండి!
➤ 1951 లో ఇండియా జనాభ 37 కోట్లు
➤ 2021 ఇండియా జనాభా 139 కోట్లు
➤ 2016 లెక్కల ప్రకారం నేషనల్ శాంపిల్ సర్వే (NSSO ) వారు కులాల జనాభా నిష్పతి
BC 41% ,SC 20%, ST 9%, OC 30%
➤ ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్స్
BC 27%, SC15.5%, ST 7.5%, OC 50%
ఆలోచించండి!
రిజర్వేషన్ కావాలా? రిప్రజెంటేషన్ కావాలా?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కావాలని ప్రతిపాదిస్తుంది
పూలే అంబెడ్కర్ రాజ్యాధికార సమితి

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఐటిఐలపై చర్యలు తీసుకోవాలి: టి వి యు వి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్



మంచిర్యాల టౌన్, జూలై 11, ప్రజాపాలన: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఐటిఐ లపై చర్యలు తీసుకోవాలని టి వి యు వి రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రోజు జిల్లా కేంద్రంలోని శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఐటిఐ కళాశాల బిల్లింగ్ ని సందర్శించి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఐటిఐ కళాశాలలకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందని దానికే నిదర్శనమే శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఐటిఐ కళాశాలల అని అన్నారు. బిల్డింగులు మరోపక్క రెగ్యులర్ ఇన్స్ట్రక్టర్ లు లేక విద్యార్థులకు బోధన కుంటుపడిందని ఆరోపించారు. జిల్లా లోని ప్రైవేటు ఐటిఐ కళాశాలల యాజమాన్యాలు రోజు రోజుకు విద్యార్థులను వివిధ రకాల ఆదనపు ఫీజులతో యదేచ్ఛగా దోపిడీ చేస్తున్నాయని ఈ విషయం పై అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎస్ సి ఎస్ టి బి సి విద్యార్థులకు స్కాలర్షిప్ తో చదువుకునే సౌకర్యం ఉన్నప్పటికీ ప్రైవేట్ ఐ టి ఐ లు అడ్మిషన్లు ఇవ్వమంటూ గెంటేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ కళాశాలల్లో వసతులు ఉపాధ్యాయుల కొరత తీర్చి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాల యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కౌశిక్ సిద్ధార్థ విద్యార్థులు అంజి మహిమూద్ వంశీ ప్రణయ్ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నం మోడల్ స్కూల్ లో గ్రంథాలయ వారోత్సవాలు




శంకరపట్నం జూలై 11 ప్రజాపాలన రిపోర్టర్: శంకర పట్నం మండల కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు చిట్టా జ్యోతి ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పఠణోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీగా వెళ్లిచదువు యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ కేశవపట్నం గ్రామములో ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులతో పాటు అధ్యాపకులు అరుణ, బోయిని కిష్టయ్య, శోభారాణి, కవిత, శంకర్ లు పాల్గొన్నారు.

## యువత తప్పక ఓటరు నమోదు చేసుకోవాలి

**జిల్లా ఓటరు నోడల్ అధికారి కాంపెల్లి ఉషన్న**



అసిఫాబాద్ జిల్లా జూలై 11 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఓటరు నమోదు నోడల్ అధికారి కాంపెల్లి ఊశన్న సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చైతన్య, మాతృశ్రీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో తాసిల్దార్ రామ్మోహన్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 అక్టోబర్ 1న లేదా అంతకు ముందు జన్మించిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. రానున్న10 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ఓటర్ నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు పాత్ర వెలకట్టలేనిదని, విద్యార్థులు వెంటనే తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది వెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్ హెచ్ ఆర్ సి సభ్యులుగా మండల పాత్రికేయులు



శంకరపట్నం జూలై 11 ప్రజాపాలన రిపోర్టర్: జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ళ భద్రయ్య ఆదేశాల మేరకు మంగళవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన పాత్రికేయుడు దేవునూరి రవీందర్ ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా అధికార ప్రతినిధిగా,అంబాలపురం గ్రామానికి చెందిన దామెర సతీష్ ను శంకరపట్నం మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆకుల సంజీవరావు, మండలాధ్యక్షుడు దండు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైదాపూర్ లో ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



సైదాపూర్, ప్రజా పాలన జూలై 11 కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు సైదాపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మునిగంటి సంతోష్, భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దెంచనాల శ్రీనివాస్, మెడవేణి నరేష్, ఓ బి సి మోర్చా ప్రధాన కార్యదర్శి వెనగంటి రాజు ,బూత్ అధ్యక్షులు గొడిశాల కిరణ్, వంగ సాగర్ ,గుజ్జిగా రాజమౌళి, నాయకులు దొమ్మాటి వీరన్న సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సైదా పూర్ మండలం ఘనపూర్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి



సైదా పూర్ ప్రజాపాలన ప్రతినిధి:పల్లె పల్లె కు ప్రవీనన్న... గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రవీణ్ రెడ్డి సైదా పూర్ మండలం ఘనపూర్ లో పర్యటించారు. ప్రవీణ్ రెడ్డి ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక నెరవేర్చ బోయే హామీలను ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు తెలిజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రజా సంక్షేమం గుర్తుకొస్తోందని అన్నారు. మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టీ పేద ప్రజలకు బీ ఆర్ ఎస్ ప్రభుత్వం చేసింది శూన్యం అన్నారు. ఎన్నికలు వస్తే చాలు కొత్త కొత్త పథకాల పేర్లు చెప్పి ప్రజలను ప్రలోభాలకు గురి చేయటే తప్ప, ఆ పథకాలను సామాన్యుడికి అందేలా అమలు చేయరని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అని మాయ మాటలు చెప్పి కేసీఆర్ అధికారం లోకి వచ్చారని అన్నారు. నియామకాలు మనకు దక్కుతాయనుకొని ఆశతో ఉన్న తెలంగాణ ప్రజానీకానికి నిరాశే ఎదురైందని అన్నారు. లేక లేక నోటిఫికేష్లు వేస్తే రాత్రింబవళ్ళు చదువుకొని పరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగుల జీవితాలు పేపర్ లీకేజీ లతో రోడ్డున పడ్డాయన్నారు. ధాన్యం కొనుగోలు విషయం లో తేమ పేరుతో తరుగు తీసి రైతుల పొట్ట కొడుతున్నారని, ధాన్యం విక్రయించి నెల రోజులు గడిచిన బిల్లులు పడక రైతన్న కష్టాలు పడుతున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి కి సన్నిహితులు అని చెప్పుకునే స్థానిక ఎమ్మెల్యే హుస్నాబాద్ నియోజక వర్గానికి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని అడిగారు. తాను అధికారం లో ఉన్నపుడు కనీసం 6 నెలల కొకసారి అయినా మీటింగ్ పెట్టీ ప్రజా సమస్య లు తెల్సుకోని, వాటిని పరిష్కరించామన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే కర్ణాటక ప్రభుత్వం అమలు చేస్తున్న తరహా లో మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అన్నారు. ఏక కాలంలో రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ చేస్తాం అని, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల సాయం చేస్తామని, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని, ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీస పింఛన్ రూ. 5000 ఇస్తామని, అధికారం లోకి వచ్చిన మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ధరణి పోర్టల్ ను రద్దు చేస్తామని, భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేల సాయం, భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ. 12 వేల సాయం అందిస్తామని ప్రవీణ్ రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని అధికారం లోకి తీసుకువచ్చి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియా గాంధీ ఋణం తీర్చు కోవాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ లో చేరిన పలువురు యువకులు, మహిళలకు ప్రవీణ్ రెడ్డి పార్టీ కండువా ను కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ రెడ్డి తో పాటుగా జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రాఘవులు,, మాజీ మండల అధ్యక్షులు పల్లేని రవీందర్ రావు, వెన్నంపల్లి సింగిల్విండో మాజీ అధ్యక్షులు సారబుండ్ల రాజిరెడ్డి మాజీ సర్పంచ్ దంత సుధాకర్ వెన్నంపల్లి మాజీ సర్పంచ్ మోలుగురు కొమురయ్య, దాసరి సందీప్, భాష వేణి సంపత్,భాష వేణి రవీందర్ అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు

## రేవంత్ రెడ్డి.. నీ నిజ స్వరూపం బయటపడింది

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య**



సైదాపూర్ ప్రజా పాలన జూలై 11 :కరీంనగర్ జిల్లా సైదాపూర్ కేంద్రంలోని బుధవారం ఉదయం 11 గంటలకు హుజురాబాద్ మరియు హుస్నాబాద్ ప్రధాన రహదారి కూడలిలో విద్యుత్తుపై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగాబి ఆర్ యస్ పార్టీ అధ్యక్షుడు రాజయ్య అధ్యర్యం లో నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్తు మూడు గంటలు మాత్రమే చాలు అని వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసే కార్యక్రమంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని. ఈ సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సోమరపు రాజయ్య మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఏమి చేయలేని వాళ్ళు రైతులకు మూడు గంటల విద్యుత్తే చాలు అన్న రేవంత్ రెడ్డిని తెలంగాణ సమాజం బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఎంపీపీల పొరం అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి సర్పంచుల పొరమ్ అధ్యక్షులు శ్రీనివాస్ వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు కార్యకర్తలు రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు టిఆర్ఎస్ పార్టీ అభిమానులు సకాలంలో హాజరై నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజయ్య పిలుపునిచ్చారు

## హిమాచల్‌లో చిక్కుకున్న తెలంగాణ విద్యార్థులు..

(మొదటి పేజీ తరువాయి)

చివరిసారిగా తమతో మాట్లాడి మూడు రోజులవుతుందని మంత్రి కేటీ రామారావుకు చెప్పారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన్ను ఆశ్రయించి సహాయం కోరారు. వెనువెంటనే స్పందించిన ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌ను అప్రమత్తం చేశారు. హిమాచల్ ప్రదేశ్ అధికారులతో మాట్లాడి విద్యార్థుల ఆచూకీ తెలుసుకోవాలని, వారికి కావాల్సిన సహాయం అందజేయాలని ఆదేశించారు. ఇదే విషయాన్ని ఆయన ట్విటర్ ద్వారా కూడా వెల్లడించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన తెలంగాణ భవన్

మంత్రి కేటీఆర్ ఆదేశాలతో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. భవన్ ఉద్యోగులు వందన, రక్షిత్ నాయక్‌లకు కంట్రోల్ రూమ్ బాధ్యతలు అప్పగించి హిమాచల్ ప్రదేశ్‌లోని కులు జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారం పంపించారు.

విద్యార్థులు సురక్షితం

కసోల్ గ్రామంలో చిక్కుకుపోయిన తెలుగు విద్యార్థులు వంగరి రాహుల్, సుమంత్, సుమీత్‌తో పాటు తెలుగమ్మాయి కూడా సురక్షితంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. మధ్యాహ్నం సమయంలో వారంతా కసోల్ నుంచి బయటికొచ్చి కులు వైపుకు ప్రయాణం సాగించారు. కులు విమానాశ్రయం ఉన్న బుంతర్ వరకు చేరుకోగలిగినట్టు విద్యార్థుల్లో ఒకరైన వంగరి రాహుల్ 'ఆంధ్రప్రభ'కు తెలిపారు. తెలంగాణ భవన్ అధికారులు కూడా తమతో మాట్లాడుతున్నారని, ప్రస్తుతం తాము సురక్షితంగా ఓ హోటల్‌లో ఉన్నామని చెప్పారు. అయితే బుంతర్ నుంచి మండి వరకు వెళ్లే రహదారిలో కొండచరియలు విరిగిపడ్డ కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. రహదారి మరమ్మత్తు పనులు పూర్తయితేనే రోడ్డు మార్గం ద్వారా బయటపడగలరు. లేదంటే కులు నుంచి చండీగఢ్ వరకు విమానం ద్వారా చేరుకునే అవకాశం కూడా ఉంది. మంగళవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతోనే తాము బయటపడగలిగామని విద్యార్థులు చెప్పారు.

# రాజయ్యకు కేటీఆర్ క్లాసు

**కడియం గురించి ఇకపై మాట్లాడనన్న ఎమ్మెల్యే ..**



హైదరాబాద్:స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో సీనియర్ నేతల నడుమ జరుగుతున్న మాటల యుద్ధంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తీవ్రంగా స్పందించారు. మంగళవారం మధ్యాహ్నం ప్రగతి భవన్‌లో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కేటీఆర్ సమావేశమై ఈ అంశంపైనే ప్రధానంగా చర్చించారు. గత కొంతకాలంగా రాజయ్య వర్సెస్ కడియం మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. రాజకీయపరంగానే కాదు.. వ్యక్తిగత విమర్శలకు సైతం ఇద్దరూ వెనుకాడడం లేదు. ఈ తరుణంలో పార్టీ పరువును బజారుకీడ్చడాన్ని అధిష్టానం తీవ్రంగా పరిగణించింది. ముఖ్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కడియం శ్రీహరిపై రాజయ్య చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఇవాల్టి భేటీలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ సందర్భంలో రాజయ్యను మందలించిన ఆయన.. ఇంకోసారి అలాంటి పని చేయెుద్దని వారించినట్లు తెలుస్తోంది. పార్టీ లైన్ దాటి మాట్లాడకూదని, ఎవరూ ఆ పని చేసినా సహించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం. "ఇద్దరి వల్ల పార్టీకి నష్టం కలుగుతుంది. ఇంతటితో ఈ వివాదం ముగించాలని, ఎన్నికల సమయం దగ్గరపడుతోంది కాబట్టి ఇద్దరూ కలిసి పని చేసుకోవాలని.. లేకుంటే తీవ? పరిణామాలు ఉంటాయ"ని కేటీఆర్ రాజయ్యను హెచ్చరించినట్లు సమాచారం. మరోవైపు ఆయన కడియంతోనూ భేటీ కావొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, కెటిఆర్ ను కలసిన అనంతరం రాజయ్య మీడియాతో మాట్లాడుతూ, కడియం శ్రీహరిని కించపర్చేలా వ్యాఖ్యలు చేయలేదని కేటీఆర్ కు వివరించాన్నారు.. . కడియం శ్రీహరి తల్లిని అవమానించేలా తాను వ్యాఖ్యలు చేయలేదని రాజయ్య తెలిపారు. మరో వైపు కడియం శ్రీహరి అహంతో ప్రతి రోజూ తనపై విమర్శలు చేస్తుంటారన్నారు. ఈ విషయాలన్నీ తాను కేటీఆర్ దృష్టికి తీసుకు వచ్చినట్టుగా రాజయ్య వివరించారు. తనను కడియం శ్రీహరి ఏ రకంగా ఇబ్బందులకు గురి చేస్తారో కూడ కేటీఆర్ కు వివరించినట్టుగా పేర్కొన్నారు.. అయితే పార్టీని బలోపేతం చేసేందుకు పనిచేయాలని కేటీఆర్ సూచించారన్నారు. ఇతర విషయాలన్నీ తమకు వదిలేయాలని కేటీఆర్ సూచించారని రాజయ్య చెప్పారు. . రానున్న రోజుల్లో కడియం శ్రీహరిపై వ్యాఖ్యలు చేయకుండా ముందుకు వెళ్తానని రాజయ్య చెప్పారు. వచ్చే ఎన్నికల్లో స్టేషన్ ఘన్ పూర్ అసెంబ్లీ స్థానం నుండి ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా వారి గెలుపు కోసం పనిచేస్తానని చెప్పారు.

## సొంతం సెమీకండక్టర్ల యూనిట్‌ను నెలకొల్పనున్న ఫాక్స్‌కాన్..!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నారైల సేవలను మరింత సమర్థంగా వినియోగించుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. విదేశాలలో స్థిరపడిన తెలుగు ఎన్నారైల్లో సంపన్నులుగా ఎదిగినవారు సాధారణంగా తమ స్వస్థలాలకు రుణం చెల్లించుకునే ప్రయత్నం చేస్తుంటారు. కేవలం అమెరికా నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలలో తెలుగు ఎన్నారైలు చేపడుతున్న సేవా కార్యక్రమాలు కొన్ని వందల కోట్ల రూపాయల స్థాయిలో ఉంటున్నాయంటే అతిశయోక్తి కాదు. అయితే స్వచ్ఛంద సంస్థల రూపేణాను, వ్యక్తిగతంగా కూడా ఎన్నారైలు చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలు చెదురుమదురుగా సాగిపోతున్నాయి. వీటికి ఒక సమీకృత వ్యవస్థ లేకుండా పోయింది.

ఆలయాలు నిర్మించడం, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, విదేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లేవారికి చేయూతనివ్వడం, వైద్యశిబిరాలు, గ్రంథాలయాల ఏర్పాటు ఇలాంటి అనేక కార్యక్రమాలు ఎన్నారైల ద్వారా నిస్వార్థంగా జరుగుతున్నాయి. మరింతగా ఇలాంటి పనులు చేయగల ఆసక్తి ఉన్నప్పటికీ స్థానికంగా కార్యనిర్వహణలో భాగం పంచుకునే వ్యవస్థ, యంత్రాంగం తమకు సొంతంగా లేకపోవడం వలన చాలామంది మిన్నకుండిపోతున్నారు. ప్రభుత్వమే ఒక ప్రత్యేక వ్యవస్థను ఇందుకోసం ఏర్పాటు చేసినట్లయితే ఇప్పుడు జరుగుతున్న కార్యక్రమాలకు అనేక రెట్లు ఎక్కువగా సేవా కార్యక్రమాలు జరిగే అవకాశం ఉంటుంది.

ఎన్నారైల సేవా కార్యక్రమాలు చాలావరకు పార్టీ రహితంగా జరుగుతుంటాయి. రాజకీయ ఆలోచనలతో పని చేసే వారి కార్యక్రమాలు లేవని అనలేం. అయితే వాటికి అనేక రెట్లుగా పార్టీలను పట్టించుకోకుండా కేవలం తమ సొంత ప్రాంతంలోని ప్రజల వికాసం అనేదే లక్ష్యంగా శ్రద్ధను, సేవాతత్పరతను చూపించే ప్రవాసులు ఉన్నారు. వారంతట వారు నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల ప్రవాసుల సేవలు కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయి. ఎక్కడి నుంచైతే ఎక్కువమంది విదేశాల్లో స్థిరపడ్డారో, ఆ ప్రాంతాల్లో వారి ద్వారా వికాసం జరుగుతోంది. కానీ అన్ని ప్రాంతాలకు ప్రవాసుల సేవ అందడం లేదు. వారికి అండగా క్షేత్రస్థాయిలో పని చేయగల యంత్రాంగం, వ్యవస్థ అందుబాటులో లేకపోవడం కూడా దీనికి ముఖ్య కారణం. ఈ నేపథ్యంలో ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వారి ద్వారా అన్ని ప్రవాస తెలుగు సంఘాలతోను అనుసంధానమైతే ప్రతి ఏటా కొన్ని వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు ప్రవాసుల విరాళాలతో సొంత ప్రాంతాల్లో జరిగే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

ఆషామాషీగా, టైం పాస్ వ్యవహారం లాగా కాకుండా ఒక నిర్దిష్టమైన దృక్పథంతో, కార్యచరణ ప్రణాళికతో పని చేసినప్పుడు మరింతమంది ఎన్నారైలను సొంత రాష్ట్రాల ప్రగతిమార్గంలో భాగస్వాముల్ని చేయడం సాధ్యం అవుతుంది. అందుకోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తే ఈ ప్రయోజనం ఎక్కువగా నెరవేరుతుంది.

## పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్లో ఘనంగా సీత్ల భవాని పండుగ



మేడిపల్లి, జూలై 11 (ప్రజాపాలన ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయలలో భాగంగా బంజారా సమాజం ఎంతో పవిత్రతో జరుపుకునే మొదటి పండుగ సీత్ల పండుగ. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ సంత్ సేవాలాల్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ సుభాష్ నాయక్ సమక్షంలో 'సీత్ల భవాని పండుగ' అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు సంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత సీతాల భవాని పండుగ జరుపుకుంటారు. పంటలు పుష్కలంగా పండాలని, పశు సంపద పెరగాలని, అటవీ సంపద పెరగాలని,ఎవరూ రోగాల బారిన పడకుండా అందరూ బాగుండాలని జరుపుకునే ఈ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుభాష్ నాయక్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే తల్లి సీతాల దేవి పండుగను ప్రతియేట ఐక్యమత్యంతో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మంచి పంటలు పండి రైతులకు మంచి దిగుబడి వచ్చే విధంగా అమ్మవారిని కోరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, పోచారం డిప్యూటీ మేయర్ రెడ్యానాయక్, బోడుప్పల్ కార్పొరేటర్ సుమన్ నాయక్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు, బంజారా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

### సీ ఐ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



మంచిర్యాల టౌన్, జూలై 11, ప్రజాపాలన: ఎస్టీ హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీ ఐ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ గౌతమి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్లో పని చేస్తున్న డైలీ వైజ్ పార్ట్ టైం అన్ని రకాల వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నెల నెల రావాల్సిన వేతనాలు గత 8 నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదని పెరిగిన వేతనాలు పెండింగ్ ఏరియర్స్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ వేతనాలు, ఏరియల్స్ ఆగష్టు 10 లోపు చెల్లించాలని లేకుంటే మరుసటి రోజు నుండే పూర్తిగా విధులు బహిష్కరించి సమ్మె లోకి వెళున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందు లక్ష్మణ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భీమయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆర్థిక చేయూత



మంచిర్యాల టౌన్, జూలై 11, ప్రజాపాలన:తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భూక్యా లక్ష్మణ్ కు ఆర్థిక చేయూత. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామ వాసి గత మూడు నెలల క్రితం గుండె వ్యాధి తో బాధపడుతు గల్ఫ్ నుండీ స్వగ్రామం వచ్చిన మండల అధికార ప్రతినిధి గ్రామ కోశాధికారి అయినా ఆయనకు చికిత్స కోసం సంస్థ ఆధ్వర్యంలో రూ.24400 లు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర వ్యవస్థాప అధ్యక్షులు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ ఇలాంటి ఎంతోమంది కార్మికులు హాస్పిటల్లో బాధపడుతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకో వలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్మికులు వేల కోట్ల రూపాయలు గల్ఫ్ నుంచి విదేశీ మారకద్రవ్యం ప్రభుత్వానికి చేరుతున్న కార్మికులకు చేసింది ఐదు పైసలు లేదని ఆరోపించారు గతంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే 500 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు లింగాల వెంకటేష్ వేముల సత్తయ్య పందిరి కొమరయ్య తాళ్ల నర్సయ్య సంతపూరి దుబ్బయ్య గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సైఫాబాద్‌లో మాస్టర్ కీ టివి ఛానల్ విలేకరుల శిక్షణా తరగతులు...



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):బహుజన ఛానల్ మాస్టర్ కీ విలేకరుల శిక్షణా తరగతులు సైఫాబాద్ లోని డిక్కీ కాంప్లెక్స్ లో జరిగాయి. ఈ కార్యక్రమానికి మాస్టర్ కీ ఛానల్ రిపోర్టర్స్ కోఆర్డినేషన్ ఇంచార్జీ ఎస్. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా హాజరైన స్నేహ సంస్థల,మాస్టర్ కీ టీవీ ఛానల్ చైర్మన్ డాక్టర్ కటికల శివ భాగ్యారావు,సీనియర్ జర్నలిస్ట్ నారాయణమూర్తి మాస్టర్ కీ ఛానల్ రిపోర్టర్ లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను అందరి ముందుంచడమే ఛానల్ ముఖ్య ఉద్దేశ్యం అని, సమస్యలు చూపిస్తే సరిపోదని ఆ సమస్య పరిష్కారం కావడం కోసం ప్రజల్లో చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా రిపోర్టర్లకు కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో మొదట మాస్టర్ కీ ఛానల్ రిపోర్టర్స్ కోఆర్డినేషన్ ఇంచార్జీ ఎస్. వెంకటేశ్వర్లు విలేకరుల నుంచి సమస్యలు, సలహాలు, సూచనల స్వీకరించారు. అనంతరం డెస్క్ ఇంచార్జీ పురుషోత్తంన్యూస్ గురించి, వీడియోలు గురించి, లింకుల గురించి, స్టోరీల గురించి వివరించారు. వెంకటేశ్వర్లు స్టోరీల గురించి, మూడు ప్రోగ్రాంలకు సంబంధించిన వివరాలను వివరణాత్మకంగా ఎలా పంపాలో తెలుపగా,దుర్గప్రసాద్ వార్తలు, ప్యాకేజీలు, స్టోరీలు, న్యూస్ మార్కెటింగ్ పద్ధతి గురించి వివరించారు. సీనియర్ కెమెరామెన్ హుసేన్ కెమెరా మెలకువలు తెలుపగా,మాస్టర్ కీ ఛానల్ ఏపీ ఇంచార్జ్ గురజాల శ్రీనివాస్,తెలంగాణ ఇంచార్జ్ బురాన్ ప్రభాకర్ ,మాస్టర్ కీ టీవీ అడ్వైజర్ జగదీష్ లు పాల్గొని విలేకరులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో రెండు తెలుగు రాష్ట్రాల మాస్టర్ కీ ఛానల్ రిపోర్టర్లు పాల్గొన్నారు.




# ఖమ్మంకు రానున్న అమిత్ షా.. బహిరంగ సభకు ముహూర్తం ఖరారు



హైదరాబాద్: ఎన్నికల వాతావరణం దగ్గరికొస్తున్న నేపథ్యంలో బీజేపీ తెలంగాణపై ఫోకస్ పెట్టింది. ఇటీవల ప్రధానీ నరేంద్ర మోదీ వచ్చి రూ.6 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా తెలంగాణ బాట పట్టనున్నారు. జులై 29 న ఖమ్మంకు అమిత్ షా రానున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వివరాల్లోకి వెళ్తే గత నెల 15న ఖమ్మంలో బీజేపీ బహిరంగ సభ నిర్వహించాలనుకుంది. కానీ బిపోర్‌జాయ్ తుఫాను సహా పలు కారణాల వల్ల ఆ సభ వాయిదా పడింది. అయితే ఇప్పుడు ఆ సభ నిర్వహించేందుకు జులై 29న ముహూర్తం ఖరారైంది. మరోవైపు ఆగస్టు 16 నుంచి తెలంగాణలోని 119 నియోజక వర్గాలకు ఇంఛార్జీలుగా వివిధ రాష్ట్రాల నుంచి 119 ఎమ్మెల్యేలు రానున్నట్లు తెలుస్తోంది. వారం రోజుల పాటు నియోజకవర్గాల్లోనే వారు మకాం వేయనునన్నట్లు సమాచారం. డబుల్ బెడ్రూం, రేషన్ కార్డ్, రైతు రుణ మాఫీ, ధరణి సమస్యలు వంటి స్థానిక సంస్థల మీద ప్రత్యేక కార్యాచరణతో ప్రజల ముందుకు వెళ్లేందుకు ప్రణాళిక చేసేందుకు సిద్ధమవుతుట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే ప్రతి నియోజకవర్గాల్లో సభలు కూడా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.

# మహోగ్రరూపం దాల్చిన బోగత జలపాతం..

### భయంకరంగా వరద ప్రవాదం..



తెలంగాణ నయాగరా జలపాతాలుగా ప్రత్యేక గుర్తింపు పొందిన బోగత జలపాతాలు ప్రస్తుతం మహోగ్ర రూపం దాల్చాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ఉప్పొంగి ప్రవహిస్తోంది. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద జలపాతాలు పరవళ్ళు తొక్కుతున్నాయి. అత్యంత ప్రమాదకరంగా వరద ఉధృతి కొనసాగుతుండడంతో సందర్శకులను అనుమతించడం లేదు. ఈ వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండడంతో సందర్శకులను జలపాతాలలో దిగడానికి అనుమతించడం లేదు. దాంతోపాటు ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తున్నారు అధికారులు. గతంలో చోటు చేసుకున్న ప్రమాదాలను ఉదహరిస్తూ.. పర్యాటకులు లోనకు వెళ్లొద్దంటూ వార్నింగ్ ఇస్తున్నారు అధికారులు. ప్రవాహం భీకరంగా ఉండటంతో అందులోకి దిగితే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. నిన్నమొన్నటి వరకు ప్రశాంతంగా ఉన్న బోగత జలపాతం.. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ప్రమాదకరంగా మారింది.

## కాంగ్రెస్ బిజెపిలకు పాతర వేయాలిసిందే: మంత్రి ప్రశాంత్ రెడ్డి




నిజామాబాద్ :జూలై 11తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి పార్టీలో బంగాళాఖాతంలో కలపాలని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రోడ్డు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ పట్టణంలో మంత్రి మరియు ఎమ్మెల్యే గణేష్ గుప్తా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి కి ఓట్లేస్తే విద్యుత్ పంప్ సెట్ లకు మీటర్ల అమర్చుతారు. కాంగ్రెస్ కు ఓట్లేస్తే మూడు గంటల విద్యుత్ సరఫరా చేస్తారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాత్రివేళ విద్యుత్తును పంపుసెట్లకు అందించడంతో ఎంతో మంది రైతులు విద్యుత్ షాకుకు, పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయారని కాంగ్రెస్కు ఓట్లేస్తే రైతులకు తిరిగి పాత రోజులు వస్తాయని మంత్రి హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ బిజెపిలో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, బిజెపి ఆదాని అంబానీల కోసం, కాంగ్రెస్ దళారుల కోసం పనిచేస్తుందని బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కిందన్నారు. తెలంగాణ రైతాంగం మేలుకొని బిజెపి కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి రైతులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీగా మరోసారి బయట పెట్టుకుందన్నారు. రేవంత్ రెడ్డి ఉచితాలు వద్దంటూ మరోపక్క పెన్షన్లు ఎలా పెంచుతారని సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబుకు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని హెచ్చరించారు.. కేటీఆర్ పిలుపుమేరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో బుధవారం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి చెంప చెళ్లు మనిపించేలా రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## కామారెడ్డి జిల్లా ఎస్పీకి మహోన్నత సేవా పతకం



కామారెడ్డి, జూలై 11: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం- 2023 సందర్భంగా ప్రకటించిన సేవ పథకాలలో కామారెడ్డి జిల్లా ఎస్పీ బి. శ్రీనివాసరెడ్డికి మహోన్నత సేవ పథకం మంగళవారం ప్రకటించడం జరిగింది. ఇది వరకే ఎస్పీ సేవ, ఉత్తమ సేవతో పాటు ఇండియన్ పోలీస్ మెడల్ కూడా సాధించడం జరిగినది. ఈ సంధర్భముగా జిల్లా పోలీసు అధికారులు అందరూ ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది. ఆదే విధముగా అబ్దుల్ మాజీద్, హెడ్ కానిస్టేబుల్ కి ఉత్తమ సేవ పథకం రాగా ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 12, జులై 2023

## అభివృద్ధి ఆరాధకుడు, సాధకుడు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధినే తన సిద్ధాంతంగా మార్చుకున్నారు. కేవలం రెండు రోజుల్లో ఆయన దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకుంటే ఆ వాస్తవం అర్థమవుతుంది ఈ నెల 8న వరంగల్‌లో రూ.6100 కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. ఆ వెంటనే ఆయన అదే రోజు రాజస్థాన్‌లోని బికనీర్‌కు వెళ్లి రూ.24,300 కోట్ల ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. తెలంగాణలో 176 కిమీ పొడవైన జాతీయ రహదారి ప్రాజెక్టులు, కాజీపేటలో రైల్వే ఉత్పాదక యూనిట్‌ను ప్రారంభించిన మోదీ రాజస్థాన్‌లో ఎక్స్‌ప్రెస్ వేలు, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, విద్యుత్ సరఫరా లైన్లు, ఇఎస్‌ఐ హాస్పిటల్, బికనీర్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ ప్రాజెక్టులను ప్రజల వినియోగంలోకి తెచ్చారు. అంతకు ఒక్క రోజు ముందు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ. 12,100 కోట్ల విలువైన రైల్వే లైన్లు, తాగునీటి పథకాలు, రహదారి ప్రాజెక్టులు, ఘాట్ల అభివృద్ధి, విద్యార్థి హాస్టల్, గోరఖ్‌పూర్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం వంటి పనులను ప్రారంభించారు. అదేరోజు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో రూ. 7500 కోట్ల విలువైన అయిదు జాతీయ హైవే ప్రాజెక్టులు, రైల్ %--% రోడ్ లైన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బాట్లింగ్ ప్లాంట్ తదితర నిర్మాణ పనులను ప్రారంభించారు. అంటే ఈ రెండు రోజుల్లో ప్రధానమంత్రి రూ. 50వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించడం, జాతికి అంకితం చేయడం చేశారన్నమాట. ఈ లెక్కన గత తొమ్మిదేళ్లలో మోదీ దేశంలో ఎన్ని లక్షల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించారో, ఈ కాలంలో అభివృద్ధి ఎంత వేగంగా జరిగిందో ఒక్కసారి ఎవరైనా పర్యావలోకనం చేస్తే స్పష్టంగా అర్థమవుతుంది.ప్రధానమంత్రి మోదీ దేశంలో ఎక్కడకు వెళ్లినా ఏమి చెబుతున్నారు? 'నేటి నూతన భారతం పూర్తి శక్తి, ఉత్తేజం ఉట్టిపడుతున్న యువ భారతం. ఇవాళ మనం 21వ శతాబ్దపు స్వర్ణయుగంలో ప్రవేశించాం. మనం ఈ స్వర్ణ యుగంలో ప్రతి సెకండునూ పూర్తిగా ఉపయోగించుకోవాలి ' అని వరంగల్‌లో ఆయన ఉద్ఘాటించారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి బాగా జరిగితే మరి కొన్ని ప్రాంతాలు పూర్తిగా వెనుకబడి ఉండడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. పాతకాలపు సౌకర్యాలు, దెబ్బతిన్న రహదారులు, ముక్కుతూ మూలుగుతూ నడిచే రైళ్లు, వ్యాగన్లు, ఖాయిలా పడ్డ పరిశ్రమలతో అభివృద్ధి జరగడం సాధ్యమా? ఒక చోటి నుంచి ఇంకో చోటికి వెళ్లడానికే ఎంతో సమయం పడితే ఇక దేశం ఎలా పురోగమిస్తుంది? ఈ ఆలోచనతోనే గతంలో ఎన్నడూ లేనంత వేగంగా పనిచేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. బడ్జెట్‌లో గత ఏడాది మూలధన పెట్టుబడులను రూ. 10 లక్షల కోట్లకు పెంచింది. అందువల్లే ఇవాళ దేశంలో ఎక్కడ చూసిన జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, రైల్వే లైన్ల నిర్మాణం పెద్ద ఎత్తున సాగుతున్నాయి. ప్రపంచంలో మూలధన పెట్టుబడులు సగటున 24.18 శాతం మాత్రమే ఉంటే భారతదేశంలో అవి 33 శాతానికి చేరుకున్నాయి. దీన్ని బట్టి మోదీ ప్రభుత్వం దేశంలో అభివృద్ధిని ఎంత వేగవంతం చేసిందో అర్థమవుతోంది. స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, స్కిల్లింగ్ ఇండియా వంటి విధానాలతో కూడిన ఆత్మనిర్భర్ భారత్ ఈ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తోంది. ఒక్క జాతీయ హైవే నెట్‌వర్క్‌ను చూస్తేనే దేశం ఎంత వేగంగా అభివృద్ధి జరుగుతుందో అర్థమవుతోంది. గత తొమ్మిదేళ్లలో నాలుగు లేన్ల హైవేలు రెండు రెట్ల కంటే ఎక్కువగా పెరిగాయి. 2013-14లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు దేశంలో నాలుగు లేన్ల హైవేలు కేవలం 18,371 కిమీ ఉంటే, ఇప్పుడు అవి 44,654 కిమీ మేరకు పెరిగాయి. ఇవాళ భారతదేశంలో 1.45 లక్షల కిమీ జాతీయ హైవే నెట్‌వర్క్ ఉంది. అమెరికా తర్వాత ఇంత పెద్ద జాతీయ హైవే నెట్‌వర్క్ ఏ దేశంలోనూ లేదు. గత తొమ్మిదేళ్లలో మోదీ హయాంలో ఈ నెట్‌వర్క్ 59 శాతం పెరిగింది. ఒక్క తెలంగాణలో ఈ కాలంలో జాతీయ హైవే నెట్‌వర్క్ 2500 కిమీ నుంచి 5000 కిమీకి పెరిగింది. అనేక ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో కూడా భారతదేశంలో అభివృద్ధి ఏనాడూ ఆగలేదు. ఇవాళ భారతదేశం 7.2 శాతం మేరకు వార్షిక అభివృద్ధి రేటును ప్రదర్శిస్తోంది జాతీయ హైవేల విషయంలో మాత్రమే కాదు, వ్యవసాయం, ఉత్పాదక రంగం, మైనింగ్, నిర్మాణ రంగాల్లో మన దేశం అద్భుతమైన పనితీరు సాధించింది. వ్యవసాయ రంగం సగటున దాదాపు 5 శాతం అభివృద్ధి కనపరుస్తోంది. మనం రికార్డు స్థాయిలో 50 బిలియన్ డాలర్లకు పైగా ఎగుమతులు చేస్తున్నాం. మన బియ్యం ఎగుమతులే దాదాపు 10 బిలియన్ డాలర్లు కాగా చక్కెర ఎగుమతులు 5 బిలియన్ డాలర్లను అధిగమించింది. మన ఉత్పాదకరంగం ఏటా 8.36 శాతం అభివృద్ధి రేటు సాధిస్తోంది. ఇవాళ జీడీపీలో ఉత్పాదక రంగం వాటా 16-17 శాతం మేరకు ఉంటుంది. పలు విదేశీ సంస్థలు మన దేశంలో వివిధ రంగాల్లో ఉత్పాదక యూనిట్లను నెలకొల్పుతున్నాయి. ప్రధానమంత్రి ఏ దేశం వెళ్లినా, ఆయనకున్న అంతర్జాతీయ ప్రతిష్ఠ మూలంగా ఆ దేశం నుంచి పారిశ్రామికవేత్తలు భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఇటీవల మోదీ అమెరికా వెళ్లినప్పుడు ఒక్క మైక్రాన్ సంస్థే భారతదేశంలో 2.75 బిలియన్ డాలర్ల విలువైన సెమికండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ యూనిట్‌ను నెలకొల్పుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. దేశంలో మైనింగ్ పరిశ్రమ ఉత్పత్తి కూడా 12 శాతం మేరకు పెరిగింది. నిర్మాణ రంగంలో కూడా భారతదేశం రెండేళ్లలో మూడవ అతి పెద్ద మార్కెట్‌ను సాధించనుంది. చెప్పవచ్చిన దేమిటంటే భారతదేశం త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడం ఎంతో దూరంలో లేదు. భారతదేశ జీడీపీ 2023లో 3.75 ట్రిలియన్ డాలర్ల స్థాయిని సాధించింది. తొమ్మిదేళ్ల క్రితం ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్ హయాంలో భారతదేశం 2 ట్రిలియన్ డాలర్ల జీడీపీనే సాధించిందన్న విషయం గుర్తుంచుకోవాలి.'భారతదేశానికి మానవ వనరులు, ప్రజాస్వామ్యం, పెరుగుతున్న డిమాండ్ వరాలు. ఏ దేశానికీ ఇలాంటి లక్షణాలు లేవు' అని 2014 మార్చిలోనే మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని కాగానే ఆయన భారతదేశ అభివృద్ధి వ్యూహాన్ని నిర్మించారు. అందువల్లనే 2014లో ప్రపంచంలో పదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశం ఇప్పుడు ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందింది. మరో నాలుగేళ్లలో మన దేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఈ తొమ్మిదేళ్లలో భారతదేశం బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, బ్రెజిల్ లను అధిగమించింది. నెహ్రూ, ఇందిరాగాంధీ తర్వాత అతి దీర్ఘకాలం ప్రధానమంత్రిగా ఉన్న మోదీ ప్రజా వ్యతిరేకతను అధిగమించిన, ప్రపంచం ఆమోదించిన అతి కొద్ది మంది ప్రపంచాధినేతల్లో ఒకరు. ఆయనను మార్నింగ్ కన్సల్ట్ వంటి సంస్థలు ప్రపంచంలోనే అత్యంత జనాదరణ గల నేతగా అనేకసార్లు ప్రకటించాయి. అభివృద్ధే తన సిద్ధాంతమైన మోదీని అవినీతే తమ సిద్ధాంతంగా పనిచేస్తున్న కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలు ఎంత కుమ్మక్కైనా ఢీకొనడం సాధ్యమా?

# చెప్పేదొకటి... చేసేదొకటి..!

## కేంద్రానికి అరాచక సంఘపరివార్ మూకలకు మధ్య చెరిగిపోతున్న గీత

సమాజంలో మతపరంగా చీలికలు తీసుకువచ్చి, తద్వారా రాజకీయ ఫలితాలు రాబట్టుకోవాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్ - బిజెపి ఉద్దేశపూరిత కుట్రగా వుంది. ఎన్నికలు సమీపిస్తున్నందున, ఇటువంటి కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటున్నాయి. ప్రభుత్వ అధికారాలను ఉపయోగించి, వారు పాలనా యంత్రాంగం లోని వివిధ విభాగాలు, అధికారుల ద్వారా తమ సైద్ధాంతిక ప్రభావాన్ని విస్తరిస్తున్నారు. తమ ప్రయోజనాలకు వారిని విధేయులుగా వుండేలా చేస్తున్నారు. ప్రపంచ దేశాల ప్రజలను ఆకర్షించడానికి ప్రజాస్వామ్యంపై, సహనంపై ప్రధాని చేసే వ్యాఖ్యలు, మైనారిటీలపై జరిగే ఈ దాడులను కప్పిపుచ్చలేవు. ఇటీవల అమెరికాలో పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్రమోడీ, కులం, మతం, వర్గం, వయస్సు లేదా భౌగోళిక ప్రాంతాల ప్రాతిపదికన భారతదేశంలో వివక్ష లేదని చెప్పుకొచ్చారు. కానీ అవన్నీ తప్పని ఆ వెంటనే రుజువైపోయింది. ఈద్ సందర్భంగా మైనారిటీలపై వరుసగా దాడులు, అటువంటి దాడులకు పాల్పడిన వారికి బహిరంగంగా లేదా రహస్యంగా ప్రభుత్వం రక్షణ కల్పించడం చూస్తుంటే, బిజెపి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు అస్సలు పొంతన లేకపోవడం కనిపిస్తోంది. జూన్ 24న ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసి 24 గంటలు కూడా గడవక ముందే, కాశ్మీర్ లోని పుల్వామా జిల్లా లోని జాదూరా గ్రామంలో గల మసీదులోకి భారత సైన్యానికి చెందిన ఒక మేజర్ నేతృత్వంలో సైనికులు ప్రవేశించారు. అక్కడున్న వారిచేత బలవంతంగా 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేయించారు. అదే గ్రామంలోని అతి పెద్ద జామియా మసీదును కూడా వారు ధ్వంసం చేశారని ఆరోపణలు వచ్చాయి. తద్వారా మత స్వేచ్ఛ హక్కును వారు అణచివేశారు. సైన్యం వంటి లౌకికవాద సంస్థ లౌకికవాద భావజాలంతో సంబంధం లేకుండా, ఇటువంటి పక్షపాత ధోరణితో వ్యవహరించడం, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం చూస్తుంటే... ప్రస్తుత ప్రభుత్వ నేతృత్వంలో ప్రభుత్వ సంస్థల తీరుతెన్నులెలా వున్నదీ స్పష్టంగా అర్థమౌతోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా విమర్శలు చేసిన నేపథ్యంలో మోడీని సమర్థించడంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒకవైపు బిజీగా వున్నారు. మరోపక్క ముంబయికి 150 కిలోమీటర్ల దూరంలో జూన్ 25న గొడ్డు మాంసం తీసుకెళుతున్నాడన్న కారణంతో ఒక యువకుడిని కొట్టి చంపడం ప్రభుత్వం పాటించే సంయమన విధానాలకు ప్రత్యక్ష సాక్షిగా వుంది. ముంబయి-నాసిక్ ప్రాంతాల మధ్య కేవలం 15 రోజుల వ్యవధిలో ఇటువంటి ఘటన జరగడం ఇది రెండవసారి. రెండు కేసుల్లోనూ దాడికి గురైంది పసమందా ముస్లింలే. ఈ రెండు ఘటనలు ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ద్వంద్వ ప్రవృత్తిని తేటతెల్లం చేస్తున్నాయి. కానీ పసమందా ముస్లింల ప్రయోజనాల కోసం



పనిచేస్తున్నది తానేనని చెప్పుకోవడానికి, చూపించుకోవడానికి ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి పోటీపడుతున్నాయి. ఈ రెండు సంఘటనల్లోనూ బాధితులు రోజువారీ కూలీలు, నిరుపేద కుటుంబాలకు చెందినవారు. వీరు మాంసం, కూరగాయలు రవాణా చేసత్తా బతుకీడుస్తారు. గో రక్షకులుగా చెప్పుకునే పది, పదిహేను మంది గూండాలు వీరిపై దాడి చేశారు. రాష్ట్రీయ బజరంగ్ దళ్ నేతృత్వంలో వీరు పనిచేస్తారు. జంతువుల పట్ల క్రూరంగా వ్యవహరించడాన్ని నివారించే చట్టం కింద బాధితులపై మహారాష్ట్ర పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఇక్కడ వారు జంతువులను రవాణా చేయడంలేదన్నది వాస్తవం. ప్రభుత్వ యంత్రాంగంపైన, మత వివక్షను మరింత పెంచడంపైన సంఘ పరివార్ భావజాల ప్రభావం ఎలా వుంటుందో చెప్పడానికి మరో ఉదాహరణగా దీనిని చెప్పుకోవచ్చు. షిండే-ఫడ్నవిస్ ప్రభుత్వ హయాంలో, ఈ గోరక్షక ముఠాలు బరితెగిస్తున్నాయి. దాడులకు పాల్పడే గోరక్షకులు హంతకుల అవతారమెత్తారు. మహారాష్ట్రలో ఇలా జరగడమిదే ప్రథమం. రెండో సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోలీసులకు హుకుం జారీ చేసే వరకూ వెళ్లారు (అసలు ఆయనకు ఇలా ఆదేశాలు చేయడానికి అధికారమే లేదు). తప్పుడు ఆరోపణలపై గోరక్షకులను వేధించవద్దని ఆయన పోలీసులకు సూచించారు. ఇది విచారకరం. గో రక్షకుల వెనుక వీరి మద్దతు ఎలా వుందన్నది ఈ సంఘటనతో స్పష్టమవుతున్నది. వారిని కాపాడడం కోసం చివరకు తమ రాజ్యాంగ పదవులను కూడా దుర్వినియోగపరుస్తున్నారు. దేశవ్యాప్తంగా మైనారిటీలను ఇలా వేధించడం, కొట్టి చంపడం వంటి ఘటనలు జరుగుతున్న తీరు ఆందోళనకరం. మహారాష్ట్రలో ఈ సంఘటన జరిగిన కొద్ది రోజుల తర్వాత, బీహార్ లోని సరాన్ జిల్లాలో ఈద్ సందర్భంగా మరో దాడి జరిగింది. ఇక్కడ బాధితుడు 55 ఏళ్ళ వికలాంగుడైన ముస్లిం డ్రైవర్. సమీపంలోని ఫ్యాక్టరీకి జంతువుల ఎముకలను తీసుకెళుతుంటే ఆ డ్రైవర్‌ను కొట్టి చంపేశారు. మందులు తయారుచేసే ఫ్యాక్టరీలో ఉపయోగించడానికి ఈ ఎముకలను తీసుకెళుతున్నారు. ఈ ఫ్యాక్టరీ గత 50 ఏళ్ళుగా నడుస్తోంది. ఉత్తరాఖండ్‌లో, పురోలాలో ముస్లింల దుకాణాలను లక్ష్యంగా చేసుకుని, వాటిని మూసేయించేలా ఒత్తిడి తీసుకువచ్చారు. ఆ తర్వాత, మిగిలిన ముస్లింలను కూడా వెంటాడసాగారు. ఈద్ సందర్భంగా ఒకచోట గుమికూడి, నమాజ్‌లు చేయవద్దని, చివరకు వారి ఇళ్లలో కూడా చేయకూడదని విశ్వహిందూ పరిషత్, ముస్లింలను ఆదేశించింది. ఫలితంగా, ముస్లింలందరూ పురోలా, బార్కోట్ పట్టణాలకు దూరంగా దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో గల అడవుల్లో పండగ రోజున నమాజ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్ లోని ముంద్రాలో ఈద్ రోజున, ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థులు నెత్తిపై టోపీలు ధరించి, ఈద్-అల్-అదాపై నాటకాన్ని వేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయింది. దాంతో ఆ స్కూలు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకునేలా జిల్లా విద్యాశాఖాధికారిపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ చర్యను సమర్థించుకుంటూ జిల్లా ప్రాథమిక విద్యాధికారి, ముస్లింలు ధరించే టోపీలను హిందూ విద్యార్థులను పెట్టుకోమని కోరడం హీనమైన పనని వ్యాఖ్యానించారు. సమాజంలో మత విద్వేషం ఎంతలా పాతుకుపోయిందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. అంతకంటే ముఖ్యంగా, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ అధికారులు సైద్ధాంతికంగా ఎంతలా భ్రష్టు పట్టిపోయారనేది మరింత స్పష్టంగా తెలియచేస్తోంది. మత విద్వేష వ్యాప్తి కేవలం కొన్ని పరిధులకే పరిమితం కావడం లేదు. 'భారత్‌లోని పలువురు హుస్సేన్ ఒబామాల' గురించి జాగ్రత్త తీసుకోవడానికి తాము ప్రాధాన్యత ఇస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ వంటి వారు చెబుతున్నారంటే...కేంద్ర ప్రభుత్వానికి, ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్ దళ్ వంటి మత సంస్థలకు మధ్య గల విభజన రేఖ అదృశ్యమైపోతోంది. ముస్లింలు ఎంతమాత్రమూ సమానులు కారని ఆయన స్పష్టంగా చెబుతున్నారు. వారు కేవలం రెండో తరగతి పౌరులు మాత్రమేనని పేర్కొంటున్నారు. పైన చెప్పుకున్న ఘటనలన్నీ ఈద్ వేడుకల సందర్భంగా చోటుచేసుకున్నవే. అవేమీ యాదృచ్ఛికంగా జరిగినవి కావు. హిందూ ఉత్సవాలైనా, ముస్లిం పండగలైనా హిందుత్వ శక్తులు జరిపే దాడులు మైనారిటీలకు భీతిగొలిపే సందేశాన్ని ఇవ్వడానికి ఉద్దేశించే వుంటాయి. "మీకు జీవించడానికి ఎలాంటి హక్కులూ లేవు, మా ఆదేశాలకు అనుగుణంగానే మీరు నడవాలి. మిమ్మల్ని రక్షించేది ఏదీ లేదు." అన్నదే ఆ సందేశం సారాంశం. సమాజంలో మతపరంగా చీలికలు తీసుకువచ్చి, తద్వారా రాజకీయ ఫలితాలు రాబట్టుకోవాలన్నదే ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ఉద్దేశపూరిత కుట్రగా వుంది. ఎన్నికలు సమీపిస్తున్నందున, ఇటువంటి కార్యకలాపాలు మరింత వేగం పుంజుకుంటున్నాయి. ప్రభుత్వ అధికారాలను ఉపయోగించి, వారు పాలనా యంత్రాంగం లోని వివిధ విభాగాలు, అధికారుల ద్వారా తమ సైద్ధాంతిక ప్రభావాన్ని విస్తరిస్తున్నారు. తమ ప్రయోజనాలకు వారిని విధేయులుగా వుండేలా చేస్తున్నారు. ప్రపంచ దేశాల ప్రజలను ఆకర్షించడానికి ప్రజాస్వామ్యంపై, సహనంపై ప్రధాని చేసే వ్యాఖ్యలు, మైనారిటీలపై జరిగే ఈ దాడులను కప్పిపుచ్చలేవు. ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని పరిరక్షించాలంటే మైనారిటీలపై జరిగే ప్రతి దాడిని తప్పనిసరిగా వ్యతిరేకించాల్సిన, ప్రతిఘటించాల్సిన అవసరముంది. ఫాసిస్టు తరహా హిందుత్వ శక్తులు పాల్పడుతున్న హింసాత్మక చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటిత పరచడానికి వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులు నిరంతరంగా కృషి చేయాలి.

# దేశ సేవలో ప్రవాసుల భాగస్వామ్యం పెంచేదెలా?

ప్రపంచవ్యాప్తంగా ఇవాళ తెలుగు ముద్రలు ప్రతిచోటా ఉన్నాయి. దాదాపు ప్రతిదేశంలోనూ స్థిరపడిన, వృత్తి ఉద్యోగ వ్యాపారాలు నిర్వహిస్తున్న తెలుగువారు అనేకులు ఉన్నారు. అన్నిదేశాల్లో ప్రతి రంగంలోనూ తెలుగువారి ముద్ర మనకు కనిపిస్తుంది. తెలుగు ప్రజలు కష్టించి పని చేస్తారనే పేరు కూడా తెచ్చుకున్నారు. అందుకు తగ్గట్టే పలువురు ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారు. రాజకీయ పదవుల్లో కూడా రాణిస్తున్నారు. ప్రవాసులుగా జీవిస్తున్న తెలుగువాళ్ల ఎదుగుదల, ఉన్నతి అంతిమంగా తెలుగునేల వికాసంపై ప్రభావం చూపిస్తున్నాయి. విదేశాలలో బాగా సంపన్నులుగా ఎదిగిన తెలుగువారు, సొంత ప్రాంతాల్లో, సొంత డబ్బులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏటా తెలుగు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల రూపేణా ఖర్చవుతున్న ఎన్నారై తెలుగువారి సొమ్ము వందల కోట్ల రూపాయలలో ఉంటుందంటే అతిశయోక్తి కాదు. కేవలం సేవా కార్యక్రమాలు మాత్రమే కాదు, విదేశాల్లో ఎదిగినవారు స్వదేశంలోనూ పరిశ్రమలు పెడుతున్నారు. వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. సొంత ప్రాంతాల్లో వందల వేల మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ఉదాహరణకు అమరరాజా గల్లా రామచంద్రనాయుడు, భారత్ బయోటెక్ కృష్ణ యెల్లా తదితరులు ప్రవాసులుగా అమెరికా నుంచి స్వదేశానికి తిరిగివచ్చాక ఈ ప్రస్థానం సాగిస్తున్నారు. ఈ రకంగా తెలుగువారు ప్రవాసులుగా ఎదుగుతున్న ప్రతి పరిణామమూ తెలుగు ప్రాంత అభివృద్ధికి నేరుగానే కారణం అవుతోంది. విదేశాలలోని వారు సంఘాలుగా ఏర్పడి సమీకృత సేవలందించడం కూడా జరుగుతోంది. దాదాపుగా తెలుగువారున్న ప్రతి దేశంలోనూ ఒక తెలుగు సంఘం ఉంటుంది. కొన్నిచోట్ల ఎక్కువ సంఘాలు కూడా ఉంటాయి. అగ్రరాజ్యం అమెరికాలో సుమారుగా అయిదు లక్షల పైచిలుకు తెలుగువారు ఉన్నారనేది ఒక అంచనా! ఇంత భారీ సంఖ్యలో ఉన్నప్పుడు అక్కడ తెలుగు సంఘాలు కూడా అనేకం ఏర్పడ్డాయి, పని చేస్తున్నాయి. వారి ఎజెండాలో ఖచ్చితంగా తమ సొంత రాష్ట్రంలో సేవా కార్యక్రమాలు చేయడం అనేది విధిగా ఉంటుంది. అలాంటప్పుడు ఎన్ని ఎక్కువ సంఘాలు ఏర్పడితే మాత్రం నష్టమేముంది. తెలుగు ప్రాంతానికి మరింత విస్తృతమైన సేవ అందుతుంది.కేవలం సేవా కార్యక్రమాలు మాత్రమే కాదు. తెలుగు భాష సాహిత్యం సంస్కృతీ వైభవాలను పరిరక్షించే దిశగా కూడా ప్రవాస తెలుగు సంఘాల కృషి అనన్యమైనది. అమెరికాలో తొలి తెలుగు సంస్థ 'తానా' ఈ దిశగా అందరికీ మార్గనిర్దేశం చేసిందనే చెప్పొచ్చు. ఆటా, నాటా వంటి అనేక ఇతర సంఘాలు ఇలాంటి సత్కార్యక్రమాలను అనుసరిస్తున్నాయి. ఈ కార్యక్రమాల నిర్వహణ మీద మాత్రమే కాకుండా, కరోనా లాంటి క్లిష్ట కాలంలో మరిన్ని రకాల సేవలను సొంత ప్రాంతాలకు ప్రవాస తెలుగు సంఘాలు అందించడాన్ని మనం గమనించాలి.ఎన్నారైల సేవలను వినియోగించుకోవడంలో దాదాపుగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టిపెడుతున్నాయన్నమాట వాస్తవం. అలాగే వారి సమస్యలను గురించి ఆలోచించడానికి ప్రత్యేక విభాగాలను కూడా ఏర్పాటు చేస్తున్నాయి. కేరళ ప్రభుత్వం నోర్కా రూట్స్ పేరుతో ఏర్పాటుచేసిన విభాగం పెద్దసంఖ్యలో విదేశాలకు వెళ్ళే మలయాళీలకు మంచి సేవలు అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రతి ఏటా ప్రవాస భారతీయ దివస్?ను నిర్వహిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా ఏపీఎన్ ఆర్టీఎస్ (ప్రవాస తెలుగు సంఘం) పేరుతో ఒక వ్యవస్థను ఏర్పాటుచేశారు. ప్రవాసుల అవసరాలను తీర్చడానికి ఇవి పని చేస్తున్నాయి. కానీ ఇవి పరిమితమైన సేవలను మాత్రమే అందిస్తూ, పరిమిత ఫలితాలను మాత్రమే రాబడుతున్నాయి. కేవలం ప్రవాసుల అవసరాలు తీర్చడం మాత్రమే కాదు, తెలుగు రాష్ట్రాల అభ్యున్నతిలో, వివిధ విభాగాల అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రవాస తెలుగు వారిని పూర్తి స్థాయిలో భాగస్వాముల్ని చేసేందుకు ఇంతకంటే వ్యవస్థీకృతమైన విధానం అవసరం ఉంది.

# గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్ జిల్లా జూలై 11 (ప్రజాపాలన, ప్రతినిధి) : జిల్లాలోని గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ కు అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి జిల్లా అధికారులు, హైదరాబాద్ నుండి వచ్చిన ఐటిసి అధికారులతో గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పూర్తి స్థాయిలో చేపట్టి చెత్త రహిత గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త లను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించే విధంగా దృష్టి సారించాలని, ఇందుకు అవసరమైన వాహనాలను వినియోగించాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు వారి పరిధిలోని గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్తలను నిలువ చేసే విధానం, పరిసర ప్రాంతాలలో పాటించే పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాలలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి ఉపయోగపడే చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించి కంపోస్టు ఎరువు తయారు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇందు కొరకు సెగ్రిగేషన్ షెడ్ లను నిర్మించి ఉపయోగం లోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమాలపై ఐటిసి అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, అవసరమైతే సి.ఎస్.ఆర్ నిధులను వినియోగించుకునే విధంగా కార్యచరణ రూపొందించాలని, ఈ మేరకు ఐటిసి సంస్థ వారితో ఒప్పందం కుదుర్చుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ఐటిసి చీఫ్ మేనేజర్ ఉమాకాంత్, సభ్యులు సురేష్, సంజిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హొటల్ తాజ్ మహల్‌లో సమావేశమైన టెలీకామ్ విశ్రాంత అధికారులు...




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):విశ్రాంత టెలీకామ్ అధికారుల సర్వ సభ్య సమావేశంసికిందరాబాద్ లోని తాజ్ మహల్ హెూటల్ కాన్ఫరెన్స్ హాల్ లో జి. పద్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. పెద్ద సంఖ్యలో పదవీ విరమణ చేసిన ఐ టి ఎస్ అధికారులు త్రిపురనేని హనుమను చౌదరి, జె రామానుజం,గోవర్ధన్, మురళీధర్,కిరణ్ కుమార్, నరేంద్ర,రామచందర్, జనార్ధన్ ఇంక ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.బి ఎస్ ఎన్ ఎల్ విశ్రాంత అధికారుల సంఘం నాయకులు నేరెళ్ల కోటేశ్వరరావు, జయరాం, మహేశ్ శర్మ కూడ సమావేశం లో పాల్గొని ప్రసంగించారు. శ్రీమతి రామానుజం పాల్గొన్న ఈ సమావేశంలో రామానుజం రచించిన మై ట్రస్ట్ విత్ టెలీకామ్ ఎరా అనే పుస్తకాన్ని టి హెచ్ . చౌదరి అవిష్కరించారు.మాధవా చారి వందన సమర్పణ తో సభ ముగిసింది.

## పంచాయతి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయండి

**కార్మికుల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి**
**సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం బిజెపి పార్టీ**



ఎర్రుపాలెం మండలం గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించి వారి శ్రమను గౌరవించాలని బిజెపి పార్టీ మధిర నియోజకవర్గ ఎస్సీ మోర్చా ఇన్చార్జ్ దేవరకొండ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ గ్రామపంచాయతి వర్కర్స్ యూనియన్స్ జేఏసీ చేపట్టిన నిరవధిక సమ్మె మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని మంగళవారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వారి బృందం సందర్శించి సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యులు నూతక్కి నరసింహారావు, మండల పార్టీ అధ్యక్షులు ముక్కుపాటి శ్రీనివాసరావు, పుప్పాల చంద్రమౌళి, రాము గౌడ్, పిట్టల గోపాలరావు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్ పిఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవం



హైదరాబాద్ 11 జులై ప్రజాపాలన: ప్రముఖ ఇంజనీరు కీ.శే.నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినం సందర్భంగా తెలంగాణ 10వ ఇంజనీర్ల దినోత్సవం జులై 11 నాడు అన్ని కార్యాలయాలలో జరుపుకున్నారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ పంచాయతీ రాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో తెలంగాణ 10వ ఇంజనీర్ల దినోత్సవాన్ని పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంజయ్య తాల్క ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాం పాలనలో హైదరాబాద్ రాష్ట్రంలోని ఉస్మాన్ సాగర్, నిజాం సాగర్ హిమాయత్ సాగర్ మరియు నిజామాబాద్ జిల్లాలోని అలీ సాగర్ రిజర్వాయర్ వంటి ప్రధాన నీటిపారుదల పనులు, భవనాలు మరియు వంతెనలకు నవాబు అలీ బాధ్యత వహించారన్నారు. నదుల శిక్షణ మరియు నీటిపారుదల జాతీయ ప్రణాళికా సంఘం ఛైర్మన్ గా కూడా పనిచేసినట్లు తెలుస్తుందన్నారు. 2014 నుండి, నవాబు అలీ జన్మదినమైన జూలై 11ని తెలంగాణ ఇంజనీర్ దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ టి.మొగులయ్య, జె.మధుకర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ట్రెసరర్, గట్టు రవిందర్ డిఎఓ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ వుడ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

**సీబీఎస్ఈ పేరుతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు**
**గ్రీన్ హుడ్ పాఠశాల ఎదుట కరపత్రాలు దగ్ధంచేసి విద్యార్థి సంఘాల నిరసన**

మంచిర్యాల బ్యూరో, జూలై 11, ప్రజాపాలన: సీబీఎస్ఈ పేరు చెప్పి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారంటూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో ని గద్దెరాగడి అమ్మా గార్డెన్ దగ్గరలో ని గ్రీన్ వుడ్ పాఠశాల ముందు ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పాఠశాల కు సంబంధించిన కరపత్రాలను దగ్ధం చేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆ పాఠశాల గుర్తింపును




రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీబిఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాగిరి రాజేష్ మాట్లాడుతూహా కార్పోరేట్ పాఠశాలల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు విద్య బోధించే విధానం లో నాన్యత పాటించడం లేదని విమర్శించారు. ఇలాంటి పాఠశాలల కు అధికారులు ఎలా అనుమతిని ఇస్తున్నారో అర్థం కావడంలేదని అన్నారు. జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారుల పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్ , టివియువి రాష్ట్ర కార్యదర్శి, బచ్చలి ప్రవీణ్ కుమార్ , విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు సల్మాన్ , బిసివిఎస్ జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్ , సంజయ్ కుమార్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ,విద్యార్థి సంఘాల నాయకులు అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి: జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం



ఆసిఫాబాద్ జిల్లా జూలై 11 (ప్రజాపాలన, ప్రతినిధి ) : జిల్లాలోని అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో డి.ఆర్.ఓ రాజేశ్వర్ తో కలిసి జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపొందించడం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండిన ప్రతి ఒక్కరు ఫారం 6 ద్వారా తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జాబితాలో ఓటరు చిరునామా మార్చుకునేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, చిరునామా మారిన వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.1400 మంది ఓటర్లు దాటిన ప్రాంతాలలో అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉన్న ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రాలు గుర్తించి అక్కడ నమోదు చేయాలని, మరణించిన ఓటర్లు, రెండు ఎపిక్ కార్డులు కలిగిన ఓటర్ల వివరాలను నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు తన సంబంధిత తహసిల్దార్ ల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధితఅధికారులు పాల్గొన్నారు.

## కరువు పీడిత ప్రాంతాలను చేసింది కాంగ్రెస్

వనపర్తి జిల్లా ప్రతినిధి, ప్రజాపాలన(జులై 11): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సాగునీరు, కరంటు ఇవ్వకుండా వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి కరువుకు నిలయంగా, వలసలకు మారుపేరుగా చేసిందని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. జిల్లా కెద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 187మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు,



నియామకాల నినాదాలతో సమాజాన్ని కేసీఆర్ నాయకత్వంలో మలిదశ తెలంగాణ ఉద్యమం చేసి రాష్ట్రం సాధించామన్నారు. తెలంగాణ వస్తే ఏమొస్తుంది అనే దానికి సమాధానం మొత్తం దేశం యాసంగిలో ఎంత వరి పండిస్తుందో అంతకు ఎక్కువగా తెలంగాణ వరి పండించే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకువెళ్లామన్నారు. తెలంగాణలో సాగుకు యోగ్యమైన ఒక్క ఎకరా భూమి భీడు లేకుండా రైతాంగానికి సాగునీరు, ఉచిత కరంటు, రైతుబంధు, రైతుభీమా, పంటల కొనుగోళ్ల మూలంగా వ్యవసాయరంగానికి తెలంగాణ మకుటాయమానమయిందని పేర్కొన్నారు. తెలంగాణలో వ్యవసాయ రంగానికి ఇచ్చే ఉచిత విద్యుత్ తొలగిస్తామనడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. కాంగ్రెస్ పాలనలో సాగు బాగు కాలేదు %ా% బాగైన సాగును చూసి కాంగ్రెస్ కు కడుపులో కసిబిసి అవుతున్నదని ఎద్దేవా చేశారు. ఉచిత కరంటు వద్దనడం రైతాంగాన్ని అవమానించడం .. వ్యవసాయరంగం పట్ల వారి ధోరణి బయటపెడుతున్నదన్నారు. రెండున్నర కోట్ల జనాభా రాష్ట్రంలో వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నదని తెలిపారు. 24 గంటల కరంటు మూలంగా రైతు తన అవసరాన్ని బట్టి వాడుకుంటారని, కరెంటు ఇవ్వడం నేరం అన్నట్లు, వాళ్ల పాలనలో ఉద్దరించినట్లు, వారేదో ఆర్థిక నిపుణులు అయినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కొక్క ఇటుక పేర్చి వ్యవసాయాన్ని ఒక స్థాయికి తీసుకువచ్చామని వివరించారు. భూగర్భజలాలు పెరిగాయి .. ప్రజలకు ఉపాధి పెరిగింది .. పల్లెలు పచ్చబడ్డాయి .. ఆర్థిక పురోభివృద్ధి జరిగి వలసలు ఆగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమ్మెకు బిజెపి సంఘీభావం

**జాతీయస్థాయిలో అవార్డు తెచ్చి పెట్టిన కార్మికులను విస్మరించడం కెసిఆర్ అహంకారానికి నిదర్శనం: బీపీ నాయక్**



బోనకల్, జులై 11 ప్రజా పాలన ప్రతినిధి: స్థానిక మండల కార్యాలయం వద్ద గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని, కార్మికుల శిబిరాన్ని సోమవారం నాడు సందర్శించిన భారతీయ జనతా పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బందితో కలిసి కళ్ళకు గంతలతో మోకాళ్లపై నిలబడి నిరసనను తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ బీపీ నాయక్ ఇతర నాయకులు మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రతిరోజు బ్రతుకు కోసం, ఆత్మగౌరవం కోసం కొట్లాట జరుగుతూనే ఉందని. అమరవీరుల ఆకాంక్షలు నెరవేరలేదని, సీఎం కెసిఆర్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అవినీతి ఊబిలో దింపారని ఉద్యోగస్తులకు కార్మికులకు సరైన జీతాలు ఇవ్వకుండా నరకయాతన చూపిస్తున్నారన్నారని, పల్లెలను పట్టణాలను ప్రతిరోజు శుభ్రం చేసే గ్రామపంచాయతీ సిబ్బందుల పట్ల వారి డిమాండ్ల పట్టించుకోకుండా ఈ గుడ్డి ప్రభుత్వం కక్ష సాధింపుతో నిరంకుశ ధోరణి అవలంబిస్తుందని దుయ్యబట్టారు. పంచాయతీ కార్మికులందరూ కష్టపడితేనే జాతీయ స్థాయిలో గ్రామపంచాయతీ లకు, రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు వచ్చాయని. అయినా వారి కష్టాన్ని గుర్తించకుండా మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని అవలంబిస్తూ శ్రమదోపిడి చేస్తున్నారని, వారికి గౌరవ వేతనం ఇవ్వకుండా కనీస గౌరవం ఇవ్వకుండా వెట్టిచాకిరీ విధానాన్ని కొనసాగిస్తున్నారు. వారికి వెంటనే గౌరవ వేతనాన్ని 20000 రూపాయలను అందించాలని, పంచాయతీ కార్మికులందర్నీ వెంటనే పర్మినెంట్ చేయాలని, జీవిత కనీస బీమా కల్పించాలని, గౌరవార్థం వాళ్ళందర్నీ పంచాయతీ సహకార్యదర్శి, పంచాయతీ సిబ్బందులుగా మార్చాలని, పని గంటల సమయాన్ని ఎనిమిది గంటలకు కుదించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరపనేని అప్పారావు, జిల్లా నాయకులు తాళ్లూరి సురేష్, జంపాల రవి, సీనియర్ నాయకులు మందపల్లి పాపారావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కృషి



వనపర్తి జిల్లా ప్రతినిధి, ప్రజాపాలన(జులై 11): ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువగా ఉంటూ నేరాలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ రక్షిత కే మూర్తి తెలిపారు. వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలంలోని జంగమయ్యపల్లి, బలిజపల్లి గ్రామాలలోని ప్రజలు నేను సైతంలో భాగంగా తమ స్వంత నిధులతో తమ తమ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...నేరాల నిర్మూలనకు సీసీ కెమెరాలు ఎంతో సహకరిస్తాయన్నారు. ప్రజల రక్షణ, భద్రత, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని, నేరస్తులను గుర్తించడం కొరకు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే గుర్తించి, వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ కలిగి ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వ్యక్తుల సమాచారాన్ని వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గ్రామలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని పేర్కొన్నారు. భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. తమ తమ గ్రామాల స్వీయ రక్షణలో ప్రజలు బాగస్వాములు కావాలని నేరాల రేటు తగ్గుతాయని ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు జయంతి, సతీష్,ఎంపీటీసీ వీరమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, నాగేష్ వీరితో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం వేడుకలు





మేడిపల్లి, జూలై 11 (ప్రజాపాలన ప్రతినిధి): రామంతాపూర్ డివిజన్లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్లో ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర అమృత మహోత్సవాల్లో సందర్భంగా కుటుంబ నియంత్రణ ప్రతిజ్ఞను చేసి తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను వివరించి, వైద్య శాఖలో వివిధ విశిష్ట సేవలు అందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలను మెమొంటోలను అందించారు. జిల్లావ్యాప్తంగా నూతనంగా ఎంపికైన ఆశ వర్కర్లకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి నారాయణరావు, ఆనంద్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు రంగనాథ స్వామి , మంజుల , ఎన్ టి పి ఈ సంధ్యారాణి, డి ఐ ఓ సరస్వతి, డిపిహెచ్ఎన్ఓ శేషు పద్మ, డిప్యూటీ డిఇఎంఓ, అంజయ్య, డాక్టర్లు సౌందర్య లతా, రమాదేవి , మంజుల, మెడికల్ సూపర్వైజర్ భోగా ప్రకాష్, డాక్టర్లు ఏం ఏఎన్ఎంలు, టెక్నీషియన్లు, రేడియాలజిస్ట్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, కాటేపల్లి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా బోనాలు



ప్రజాపాలన, సంగారెడ్డి ప్రతినిధి:సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన ఉంచుకుని సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఐ టి ఐ నుండి ఐబీ మీదుగా యఫ్ఆర్ఎస్ వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. భక్తులు అత్యంత ఉత్సాహంగా భక్తి శ్రద్ధలతో డప్పు చప్పుళ్ళ, పోతురాజుల విన్యాసాలు, కళాకారులు, యువకుల నృత్యాలతో పట్టణ పుర వీధుల మీదుగా తరలివెల్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి అమ్మవారి కృప కటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతప్రభాకర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క నాగరాజు గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, గౌడసంఘం నాయకులు, సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి ప్రతి ఒక్కరు మరింత కృషి చేయాలి: మున్సిపాలిటీ వైస్ చేర్మెన్ ఆకుల యాదగిరి





ఇబ్రహింపట్నం జూలై తేది 11 ప్రజాపాలన ప్రతినిధి: బి అర్ ఎస్ పార్టీ రంగారెడ్డి అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు యాచారం మండలం లో యాచారం గ్రామం ఎస్ ఎస్ గార్డెన్ లో గ్రామ అధ్యక్షులు మసు జనార్దన్ ఖాజు భాయ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది,ఇట్టి కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ వైస్ చేర్మెన్ ఆకుల యాదగిరి పాల్గొని గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమల గురించి కేసీఅర్ పాలనలో సంక్షేమ కార్యక్రమల గురించి చర్చించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాలు పండుగ

ఇబ్రహింపట్నం జూలై తేది 11ప్రజాపాలన ప్రతినిదిఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్ లోని వన దుర్గామాత ఆలయ ప్రాంగణంలో బోనాలు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ హరీష్ దంపతులు,డిఆర్ఓ హరిప్రియ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరంమహిళా ఉద్యోగులు బోనాలతో ప్రదర్శనగా కలెక్టరేట్ లోని వన దుర్గామాత ఆలయానికి చేరుకొన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు రంగారెడ్డి జిల్లా సుభిక్షంగా ఉండేలా దీవించాలని, అన్ని వర్గాల వారికి మేలు చేకూరేలా చూడాలని అమ్మవారిని ప్రార్థిస్తూ, భక్తి శ్రద్ధలతో మొక్కులు సమర్పించుకున్నారు.ఈ బోనాల ఉత్సవాల్లో కలెక్టరేట్ ఏఓ ప్రమీల, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అండగా మధుర చారిటబుల్ ట్రస్ట్



మేడిపల్లి, జూలై 11 (ప్రజాపాలన ప్రతినిధి) ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ డివిజన్లో జిల్లా పరిషత్ హై స్కూల్లో మధుర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ మరియు ప్లేట్లను తన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను గత 25 సంవత్సరాల నుండి మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని, పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తన వంతు సహాయంగా నోటి పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, ప్లేట్లను అందిస్తున్నామని తెలిపారు. అలాగే క్రీడా సామాగ్రి మరియు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పారితోషకంతో అందిస్తున్నామని తెలిపారు.ఆర్థికంగా పై చదువులు చదవలేని విద్యార్థిని విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు, విదేశీ చదువులు చదువుకునే వారికి ప్రోత్సాహకాలు అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. రాబోవు రోజుల్లో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లో గల ప్రభుత్వ పాఠశాలలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడతామని లక్ష్మారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ బిక్షపతి, టిపిసిసి మైనార్టీస్ జనరల్ సెక్రెటరీ సంజయ్ జైన్, హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాలేరు జే నవీన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, ఉప్పల్ నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి, మురళీకృష్ణ ముదిరాజ్, శ్యాం కుమార్, సాంసంన్, ఉప్పల్ డివిజన్ మైనారిటీస్ చైర్మన్ గజ్జల రాజు, శ్రావణ్ కుమార్, సన్నీ గౌడ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతతో పోరాడి హక్కులు సాధించుకోవాలి

**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు రహెమాన్**



ఆసిఫాబాద్ జిల్లా జూలై 11 (ప్రజాపాలన, ప్రతినిధి) : కార్మికులందరూ ఐక్యతతో హక్కుల సాధనకై పోరాడాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే – ఐజేయూ) జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా సమీకృత కలెక్టరేట్ ముందు చేపడుతున్న సమ్మెకు మంగళవారం ఆయన జర్నలిస్టులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రహెమాన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కరోనా సమయంలో గ్రామపంచాయతీ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికులు దుర్భర స్థితిలో జీవితాలు గడుపుతున్నారని పేర్కొన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు వివక్షత చూపించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ లను తక్షణమే రద్దుచేసి, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రకాష్ గౌడ్, దేవునూరి రమేష్, తూమోజు సురేష్ చారి, జాడే రాందాస్, జిల్లా గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వర్కింగ్ అధ్యక్షుడు శంకర్, రాజు, సమ్మయ్య, ప్రసాద్, శ్రీను, సబిర్, నారాయణ, మహేష్, నాగేష్, కైలాష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



వనపర్తి జిల్లా ప్రతినిధి, ప్రజాపాలన(జులై 11): వనపర్తి జిల్లా, పెబ్బేరు మున్సిపాలిటీ పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో మంగళవారం మండల విద్యాధికారి జయరాములు పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావలసిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సీపీఎస్ బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఈనెల 16వ తేదీన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభమై గద్వాల జిల్లా నుండి వనపర్తి జిల్లా మీదుగా కొనసాగుతుందన్నారు. తలపెట్టిన కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్సీపీఎస్ఈయూ మండల అధ్యక్షుడు దొడ్ల దయానంద్, ప్రధాన కార్యదర్శి చిన్న స్వామి, శ్రీరంగాపురం మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యాయులు చిన్న రాములు, శివశంకర్ యాదవ్, రాజు, విష్ణువర్ధన్ నాయుడు, శ్రీనివాస్ గౌడ్, తిమ్మప్ప, దామోదర్, శ్రీనివాసులు, మల్లికార్జున్, నరసింహ, షణ్ముఖ శ్రీనివాస్, నారాయణ, రమేష్, మురళి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగింది తప్ప ఈ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదు: కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి




మేడిపల్లి, జూలై 11 (ప్రజాపాలన ప్రతినిధి):ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్, చిల్కానగర్ డివిజన్లో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రజల సమస్యలు మీ దృష్టికి రాలేదా ఎంతవరకు పరిష్కరించారు ఎప్పటి వరకు పరిష్కరిస్తారు అని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మల్లాపూర్, చిల్కానగర్ డివిజన్లో గత నాలుగున్నర సంవత్సరాలుగా సమస్యలు పరిష్కరించబడక ప్రజలు ఇబ్బందులు పడుతూ విష జ్వరాల బారిన పడుతున్నారని ఆయన ఆరోపించారు. డివిజన్లోని ప్రభుత్వ భూములు కాపాడాలని చెరువుల సుందరీకరణ చేయాలని డ్రైనేజ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, స్మశాన వాటికలో వసతులు కల్పించాలని, అంతర్గత రోడ్లను బాగు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ జిల్లా కోర్టుకు కళాశాలకు భూములు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చిల్కానగర్లో పేద ప్రజలకు పట్టాలిచ్చింది నీటి సమస్యను పరిష్కరించింది కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొట్టు రాజేష్, రాజ్యలక్ష్మి, వినోద్ ముదిరాజ్, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## సర్కిల్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు చేపట్టిన వసంత కుమార్ కి స్వాగతం పలుకుతూ సన్మానించిన పట్టణ కాంగ్రెస్ నాయకులు




మధిర జూలై 11 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో స్థానిక సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధితులు చేపట్టిన వసంత కుమార్ సాదర స్వాగతం పలుకుతూ వారిని సన్మానించి స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిరలో అనేక సంవత్సరాలు రూరల్ ఎస్సైగా పనిచేసే మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తిని ఇక్కడ నుండి ప్రమోషన్ తో వెళ్లిన అనేక సర్కిల్ పరిధిలో సి ఐ గా పనిచేసి మధిర సి ఐ గా బాధ్యతలు చేపడుతున్న వసంత కుమార్ పోలీస్ శాఖలో మంచి పేరున్న వ్యక్తిని వారికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పారుపల్లి విజయకుమార్ పాల్గొన్నారు

## సిసి రోడ్డుకు ..శంకుస్థాపన చేసిన చావా రామకృష్ణ



ఎర్రుపాలెం 11 (ప్రజా పాలన ప్రతినిధి ):మండల పరిధిలోని సకునవీడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామ పంచాయతీకి పది లక్షల ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేసిన దానిలో భాగంగా ఏఎంసీ మాజీ అధ్యక్షులు చావా రామకృష్ణ ,ఎంపీపీ దేవరకొండ శిరీష సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ప్రతి గ్రామము అభివృద్ధి పదంలో ఉండాలని ఉద్దేశంతో కెసిఆర్ సిసి రోడ్లకు నిధులు మంజూరు చేశారని చావా కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పంబిసాంబశివరావు, వైస్ ఎంపీపీ రామకోటయ్య, పెద్ద గోపవరం ఎంపీటీసీ సగ్గుర్తి కిషోర్ బాబు, రేమిడిచర్ల సర్పంచ్ చెన్నం రాజు పురుషోత్తం రాజు, సాంబశివరావు, పవన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు.. సంఘీభావం తెలిపిన బిజెపి



ఎర్రుపాలెం జూలై 11 (ప్రజా పాలన ప్రతినిధి ): డిమాండ్ల సాధనలో భాగంగా గత ఆరు రోజులుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు జేఏసీ యూనియన్ పిలుపుమేరకు సమ్మె చేస్తున్న పంచాయితీ కార్మికులకు బిజెపి పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటించింది .ముందుగా అధ్యక్షా, కార్యదర్శులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు . అనంతరం దీక్ష శిబిరం నందు బిజెపి నాయకులు మధిర నియోజకవర్గ ఎస్సీమోర్చా ఇన్చార్జి దేవరకొండ కోటేశ్వరావు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని , వారికి కూడా సెలవులు ప్రకటించాలని కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతు తెలిపిన బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా సభ్యులు నూతక్కి నరసింహ రావు ,మండల పార్టీ అధ్యక్షుడు మొక్కపాటి శ్రీనివాసరావు, పుప్పాల చంద్రమౌళి, రామ గౌడ్, పిట్టల గోపాలరావు ,ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అతిరుద్ర మహాయోగానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి



తాండూర్ ప్రజా పాలన ప్రతినిధి తాండూర్ లో నిర్వహిస్తున్న అతిరుద్ర మహాయోగానికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తాండూర్ లో శాసనసభ్యులు రోహిత్ రెడ్డి నూతన గృహ సమీపంలో జరుగుతున్న అతిరుద్ర మహాయోగానికి ఆయన విచ్చేసి పాల్గొని పూజించారు. మంగళవారం రోజుయోగానికి అధిక సంఖ్యలో దంపతులు వచ్చి యోగంలో పాల్గొంటున్నారు. ప్రాంత ప్రజలు సుఖశాంతులతో ఉండాలని తాండ్ర ప్రాంతం అభివృద్ధి చెందాలని శాసనసభ్యులు యోగం చేస్తున్నారు అదేవిధంగా వచ్చే భక్తులకు అన్నదానం తదితర సేవలు అందిస్తున్నారు. యోగంలో సంఘటనలు జరగకుండా పోలీసులు వాలెంటర్లుగట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జిల్లా పద్మశాలి సంఘం ఎన్నికలకు సహకరిస్తాం: మండల అధ్యక్షుడు లింగయ్య



ఆసిఫాబాద్ జిల్లా జూలై11(ప్రజాపాలన ప్రతినిధి): పద్మశాలి సంఘం జిల్లా ఎన్నికలకు పూర్తి సహకారం అందిస్తామని పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షుడు కోమటిపల్లి లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో లింగయ్య మాట్లాడుతూ అన్ని మండలాల కార్యవర్గ సభ్యుల నిర్ణయం మేరకు నిర్ణయించిన జిల్లా పద్మశాలి సేవా సంఘం ఎన్నికలను విజయవంతం చేస్తామన్నారు. సోమవారం జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక నిర్ణయించలేదని, కేవలం ఎన్నిక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పద్మశాలీల ఐక్యతను కొంతమంది పలు సంఘాల పేరుతో అధ్యక్ష కార్యదర్శి ఎన్నిక నిర్వహించినట్లు ప్రకటించి ప్రజలను అయోమయంలోకి నెట్టుతున్నారని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఈనెల 23న జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని కుల బాంధవులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ఇరుకుల్ల ఆంజనేయులు,మండల ప్రధాన కార్యదర్శి ఆల్గే శ్రీకాంత్,చందు,సంజీవ్, మహిళా అధ్యక్షురాలు రాంపల్లి విజయ, మంగ, జంజిరాల శ్రీనివాస్, మధుకర్,మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## కసాయి తండ్రి చేతిలో బలి అయిన చిన్నారుల కుటుంబాన్ని పరామర్శించిన డా. కోట రాంబాబు



మధిర రూరల్ జూలై 11 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో రాయపట్నం గ్రామంలో కసాయ తల్లి చేతిలో బలి అయిన చిన్నారులను అతి కిరాతకంగా చంపిన నేరస్తుడైన తండ్రిని కటినంగా శిక్షించాలి నిన్న ఒక కసాయి తండ్రి తన ఇద్దరు చిన్నారులను అతి కిరాతకంగా చంపగా ఆ చిన్నారుల మృతదేహాలను ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పొంగులేటి శ్రీనన్న మధిర నియోజకవర్గ ఇన్చార్జి లిడా.కోట రాంబాబులి సందర్శించి నివాళులు అర్పించారు. చిన్నారుల తల్లిని పరామర్శించి నెరస్తుడైన ఆ కసాయి తండ్రిని కటినంగా శిక్షించే విధంగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేస్తూ ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి ఆర్థిక సహాయం అందించారు

## వేమవరపు నిలమ్మ సేవలు మరువలేనివి

### మునిసిపల్ చైర్ పర్సన్ మొండితోక లత జయాకర్



మధిర జూలై 11 ప్రజాపాలన ప్రతినిధి మున్సిపాలిటీ నందు గత 30 సంవత్సరాలుగా శానిటేషన్ స్వీపర్ గా సేవలందిస్తున్న నీలమ్మ గత రాత్రి అనారోగ్య కారణంగా మరణించినందున వారి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు , మున్సిపల్ చైర్పర్సన్ మొండితోక లతజయకర్ , వారి వెంట కమిషనర్ రమాదేవి 11వార్డ్ కౌన్సిలర్ మాధురి గారు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కోటేశ్వరావు చిత్తారి నాగేశ్వరావు మండలం బిఆర్ఎస్ అధ్యక్షుడు పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు వెంకటేశ్వరరావు వైస్ చైర్మన్ విద్యాలత వెంకట్ రెడ్డి కౌన్సిలర్ మాధురి బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి మాట్లాడే తీరు మార్చుకోవాలి: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



ఇబ్రహింపట్నం జూలై తేది 11 ప్రజాపాలన ప్రతినిధి: వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని , మూడు గంటల కరెంటు మాత్రమే రైతులు కోరుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రకటించడాన్ని జిల్లా బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు , ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతులు అసలు ఉచిత విద్యుత్తే కోరుకోవడంలేదని అమెరికాలో జరుగుతున్న తానా మహాసభల్లో రేవంత్ రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తెలంగాణ రైతాంగంపట్ల కాంగ్రెస్ పార్టీ విధానాలకు అద్దంపడుతున్నాయని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎట్లుండెనో తిరిగి అదేపద్ధతిలోకి తీసుకుపోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుందనడానికి రేవంత్ వ్యాఖ్యలే నిదర్శనమని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ను నమ్మితే కరెంటు లేకుండా పోతుందని రైతుబంధు , రైతుభీమా పథకాల ఊసులేకుండా చేస్తారని , కొనుగోలు కేంద్రాలు మూతపడేస్తారని అన్నారు. రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా బి అర్ ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రేపు ( బుధవారం ) జిలావ్యాప్తంగా మండలకేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దగ్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి.

## సింగరాయపాలెంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం..



కొనిజర్ల, జూలై 11 (ప్రజా పాలన న్యూస్):అమెరికా పర్యటనలో రేవంత్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైరా శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ ఆదేశానుసారం మండలంలోని అన్ని గ్రామాల నందు రేవంత్ రెడ్డి యొక్క దిష్టిబొమ్మలు దహనం చేయడం జరిగినది.అమ్మపాలెం గ్రామం నందు రైతు సమన్వయ సమితి కన్వీనర్ కిలారు మాధవరావు ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి యొక్క దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుకూరి నాగేంద్రమ్మ రైతు సమన్వయ సమితి కన్వీనర్ ఖాదర్ బాబు విద్యా కమిటీ చైర్మన్ రామ్మూర్తి, చావగాని వెంకట పిచ్చయ్య, రావెళ్ల శ్రీనివాస్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.సింగరాయపాలెం గ్రామంలో పార్టీ గ్రామ కార్యదర్శి అలవాల తిరుమలరావు ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి యొక్క దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.

## మధిర, ఎర్రుపాలెం మండలముల విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి



మధిర జూలై 11 ప్రజాపాలన ప్రతినిధి నియోజవర్గ పరిధిలో మధిర ఎరుపాలెం మండలం లో విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి గృహ, వాణిజ్య, పరిశ్రమలు మరియు వ్యవసాయ విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడినప్పుడు తక్షణం మీ ఫీడర్ పరిధిలోని సబ్ స్టేషన్ నందు లేదా మీ ప్రాంత లైన్ ఇన్స్పెక్టర్, లైన్మెన్, జూనియర్ లైన్మెన్ లను సంప్రదించి తక్షణం విద్యుత్ సరఫరా పునరుద్ధరించుకోగలరు. అదేవిధంగా నూతన విద్యుత్ కనెక్షన్ల మంజూరు చేసినప్పుడు, నూతన ట్రాన్స్ఫారం ఏర్పాటు చేసేటప్పుడు, కొత్తగా విద్యుత్ స్తంభాలు వేసి లైన్లు ఏర్పాటు చేసేటప్పుడు అదేవిధంగా ఆగిపోయిన, కాలిపోయిన మీటర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేటప్పుడు కానీ విద్యుత్ శాఖ సిబ్బందికి గాని ప్రైవేట్ వ్యక్తులకు గాని ఎటువంటి డబ్బులు ఇవ్వవలసిన అవసరం లేదు. ప్రతి విద్యుత్ సంబంధిత పనులకు చెల్లించవలసిన మొత్తాన్ని విద్యుత్ శాఖ వారికి ఆన్లైన్ ద్వారానే చెల్లింపులు జరుగుతున్న తరుణంలో ఎవరైనా మీ నుండి బలవంతపు వసూళ్లకు పాల్పడితే తక్షణం సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల మొబైల్ నెంబర్లకు మధిర ఏడిఈ 9440811533, మధిర టౌన్ సెక్షన్ ఏఈ 9440811552, మధిర రూరల్ సెక్షన్ ఏఈ 9491058652, ఎర్రుపాలెం సెక్షన్ ఏఈ 9440814144, మామునూరు సెక్షన్ ఏఈ 9440628592) నేరుగా ఫిర్యాదు చేయవలసినదిగా విద్యుత్ శాఖ మధిర సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీమతి ఎం. అనురాధ కోరుతున్నారు.

# గౌరవ వేతనం అమలుపరచాలి



ఎర్రుపాలెం జూలై 10 (ప్రజాపాలన ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సొంత డబ్బులతో పెట్టుబడి పెట్టి అన్నం వండి పెడుతున్న వంట కార్మికులకు గత ఏడాది కాలం నుండి బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆర్థికంగా నష్టపోతూ అప్పులు తీర్చలేక అవమానాలకు గురవుతున్నారని, మధ్యాహ్నం భోజన కార్మికులు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సిపిఎం మండల పార్టీ కార్యదర్శి దివ్వల వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నం భోజన కార్మికుల దీక్ష శిబిరాని సోమవారం ప్రారంభించారు. తెలంగాణ కార్మికుల యూనియన్ సిఐటి ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా మండల కేంద్రమైన ఎర్రుపాలెం మండల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన కార్మికుల దీక్ష లో పాల్గొన్నారు.అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన గౌరవ వేతనాలను అమలు నోచుకోలేక కార్మికులు బకాయిలు పెద్ద మొత్తంలో పెరిగాయి. 15 సంవత్సరాలు కాలం నుండి ఒకే వేతనంతో పనిచేస్తున్న కార్మికులకు26వేల రూపాయలు కనీస వేతనం అమలుపరచాలని హెచ్చరించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన నిర్వహణ సంస్థ స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పరాదని, సబ్సిడీపై వంట గ్యాస్ అందించాలని, మెనూ చార్జీలు పెంచాలని ,ప్రమాద బీమా పిఎఫ్ ,ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వాన్నికోరారు. సోమ ,మంగళవారం రెండు రోజులు మండలంలోని నిరవధిక దీక్ష పాల్గొని అనంతరం 12వ తారీఖున జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా ముట్టడి కార్యక్రమంలోపాల్గొనాలన్నారు . కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగులవంచ వెంకట్రామయ్య ,గామాస్ జోగయ్య, మండల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గొల్లపూడి కోటేశ్వరావు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు పాండు, సరోజిని చింతిరాల దేవకరణ ,కార్మికులు విజయ ,మంగమ్మ రాణి, లలిత, రమణమ్మ ,పాప ,తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కుటుంబం చింత లేని కుటుంబం



### ప్రపంచ జనాభా దినోత్సవం ఆకట్టుకున్న కళ ప్రదర్శన

మధిర మధిర రూరల్ జూలై 11 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పి హెచ్ సి తరుపున దెందుకురు వైద్య లు డాక్టర్ పృథ్వి ఆధ్వర్యంలో లో పారా మెడికల్ బృందం ర్యాలీ పీహెచ్సీవద్ద నిర్వహించడం జరిగింది అదేవిధంగా మున్సిపాలిటీలో ఎస్సీ కాలనీ ప్రాథమి క పాట శాలదగ్గర లో విధి అరుగు దగ్గర ప్రపంచజనాభా దినం సందర్భంగా అధికజనాభా వల్ల కలిగే అనర్ధ లు మరియు చిన్న కుటుంబ చింత లేని కుటుంబ అంటూ పీఎస్ హరి జన వాడ 5వ తరగతి విద్య ర్థులు మరియు ద్వాక్రా ఆశ కార్యకర్తలు చె లంకా కొండ య్య బృందం చిన్న కళా ప్రదర్శన చేసి జానపద గీతా లు ఆలపించి నారుఈ కార్యక్రమం లో ఆరోగ్య సిబ్బంది పద్మావతి గోవింద్ సుబ్బా లక్ష్మి కౌసెల్య ఏఎన్ఎం లు విజయకుమారి లక్ష్మి భారతి లీలా ఆరునా జయమ్మ ఆరునా పల్లె దావఖన సిబ్బంది ఇస్వీర్య అఖిల భార్గవి డాక్టర్ సునీత డాక్టర్ హేమలత పి సిహెచ్ సి స్టఫ్ ఆశ లు ఐకేపీ జిపి సిబ్బంది హెచ్ ఏ నాగేశ్వరావు టీబీ యూనిట్ సిబ్బంది సందీప్ శివ అంగన్వాడీ వెంకటరమణ పాల్గొన్నారు

## నిదానపురం గ్రామపంచాయతీలో సిసి రోడ్లు శంకుస్థాపన



మధిర రూరల్ జూలై 11 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో నిదానపురం గ్రామంలలో పలు శంకుస్థాపనలకు హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలోని గ్రామపంచాయతీలకు అధికంగా నిధులు ఇచ్చి గ్రామాల్లో అభివృద్ధిలో దూసుకెళ్తూ పలువురికి ఆదర్శ ఉంటున్న మన ముఖ్యమంత్రిని వారు తెలిపారు.గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు మంజూరీ చేసిన ప్రతి గ్రామపంచాయితీ 10లక్షలు ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేసిన దానిలో భాగంగా ఈ రోజు సీతానగరం గ్రామం లో 10లక్షల అంచనగల సీసీ రోడ్లకు మండల,స్తానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ బంధం శ్రీనివాస్ మండల బి ఆర్ఎస్ అధ్యక్షులు రావూరి శ్రీనివాస్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ కోటేశ్వరావు వివిధ హెూదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ఇబ్రహింపట్నం జూలై తేది 11 ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహీంపట్నం తహసిల్దార్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమ్మె రెండోరోజు జరిగింది. ఈ సదర్భంగా మాట్లాడుతూ రెండు రోజులుగా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేయకుండా కార్మికులు సమ్మె చేస్తున్న అధికారులు గానీ ప్రభుత్వం గానీ స్పందించడం లేదని అన్నారు. అక్టోబర్ నెలనుండి గుడ్ల డబ్బులు, మార్చి నెల నుండి కూరగాయల బిల్లులు రావడంలేదని ఎంత వరకు అప్పుచేసి పెట్టాలని అన్నారు.పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. రేపటి కలెక్టర్ కార్యాలయం ముట్టడితో స్పందన రాకపోతే సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.విపరీతంగ ఈ కార్యక్రమంలో మధ్యన భోజన కార్మిక సంఘం నాయకులు %జష్త్ర% సరిత, ప్రేమలత కొండ్రు పుష్పమ్మా, %జీ% శిరీష, కొండ్రు సుగుణమ్మ, %ూ% కల్పనా, జంగామ్మ, అలివేలు, పద్మమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు .

## ఆటో యూనియన్ సమస్యల పరిష్కారానికి కృషి: మాజీ కార్పొరేటర్ జోత్స్నా నాగేశ్వరావు



మేడిపల్లి, జూలై10 (ప్రజాపాలన ప్రతినిధి) :ఆటో యూనియన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామంతాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్న నాగేశ్వరావు పేర్కొన్నారు.రామంతాపూర్ శారద నగర్ ఏడిఆర్ఎం లైన్లో ఆటో స్టాండ్ దగ్గర ఆటో యూనియన్ బోర్డును మాజీ కార్పొరేటర్ జోత్స్న నాగేశ్వరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధ్హాన కార్యదర్శి చింతపల్లి ప్రశాంత్ ,ఆశోక్ ,వెంకటయ్య ,జహంగీర్ ,శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ మారెళ్ళ మమత దంపతులను కలిసిన సుధాకర్..



తల్లాడ, జులై 11 (ప్రజా పాలన న్యూస్): లితల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ మారెళ్ళ మమత, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు దంపతులను మంగళవారం సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండూరు సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన 4000 పెన్షన్, మేనిఫెస్టో, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని కాంగ్రెస్ మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరిస్తూ పంపిణీ చేశారు. బొమ్మగాని రామనాథంను కలిసి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్, గోవిందు శ్రీనివాసరావు(ట్రాక్టర్), మాగంటి శ్రీనివాసరావు, దుగ్గిని గోపయ్య, గోవిందు నరసింహారావు, పిన్ని కృష్ణయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి



ఇబ్రహింపట్నం జూలై తేది 11 ప్రజాపాలన ప్రతినిధి: మధ్యాహ్న భోజన జిల్లా కార్య దర్శి యెలామోని స్వప్న సిఐటియు మండల కన్వీనర్ చందు నాయక్ మాట్లాడుతూ.మధ్యాహ్న భోజన పథకం 2009లో ఏర్పడింది ఈ పథకం SC. ST BC మైనారిటీలను సామాజిక వెనుకబడిన కులాలను చెందిన వారిని విద్యను అందించి చైతన్యం చేయడానికి ఈ పథకం వచ్చిందిఈ పథకం 2011సంవత్సరం ఏర్పడింది.2009నుండి ఒక్క వెయ్యి రూపాయల వేతనం ఇస్తున్న రు. అప్పటి నుండి ఇప్పటి వరకు వెయ్యి రూపాయల వేతనం తో జీవనం గడుపుతున్నరు . చాలి చాలక వేతనం తో ఇల్లు గడవడం లేదు అప్పులు చేసి కార్మికులు వంట వండు తున్నారు వచ్చే బిల్లు లు కూడా సరిగ్గా రావడం లేదు 6 నేలల కొకసారి వస్తున్న యి. నిత్యఅవసర ధరలు విపరీతంగా పెరిగాయి.మధ్యన భోజన కార్మికులకు 2022 మార్చి బడ్జెట్ సమావేశల సందర్భంగా వేతనాలు 2000 వెయ్యి లు ముఖ్య మంత్రి పెంచినట్టు ప్రకటించినప్పటి నుండి ఏరియల్స్ తో సహా జి ఓ. నెం 8 ప్రకారం చెల్లించాలి. పెండింగ్ లో ఉన్న బిల్లులు ఇవ్వాలని ఈ నేల 10.11.12 తేదీల్లో మూడు రోజులు స్కూల్లో వంట బంద్ పెట్టి సమ్మె చేస్తున్నాము అని తెలిపారు . మా సమస్య లు పరిష్కారించక పోతే 12 తారీకు పెద్ద ఎత్తున కలెక్టర్ రేట్ ముట్టడి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ మాధవి యశోద నరేందర్ సువర్ణ అంజమ్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పాల్గొన్నారు .


## చీఫ్ ఇంజనీర్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ కు ఘన నివాళులు



మేడిపల్లి, జూలై 11 (ప్రజాపాలన ప్రతినిధి) :హైదరాబాద్ రాష్ట్ర తొలి చీఫ్ ఇంజనీర్, లెజెండరీ ఇంజనీర్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ఇంజనీర్స్ డే గా జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఇంజనీర్లు డిసి అరుణ కుమారితో కలిసి అలీ నవాజ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఈ నాగేందర్, ఇంజనీర్లు నిఖిల్ రెడ్డి, నాగమణి, రాజ్ కుమార్, సాయి కిరణ్, శ్వేత శ్రీ, జ్యోతి , రమా దేవి మరియు వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# 7 మిలియన్స్ తో "బ్రో" ఫస్ట్ సింగిల్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రల్లో, డైరెక్టర్ సముద్ర ఖని దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం బ్రో. జులై 28, 2023 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో రిలీజ్ కాబోతున్న ఈ ఫాంటసీ కామెడీ ఎంటర్టైనర్ పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వస్తోంది. రిలీజైన ఫస్ట్ సింగిల్ మై డియర్ మార్కండేయ కి సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ఈ సాంగ్ కు ఇప్పటి వరకూ 7 మిలియన్స్ కి పైగా వ్యూస్ వచ్చాయి. మ్యూజికల్ సెన్సేషన్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో ప్రియా ప్రకాష్ వారియర్ కీలక పాత్రలో నటిస్తుంది. పవన్, సాయి ధరమ్ తేజ్ సాంగ్ లో బాలీవుడ్ బ్యూటీ ఊర్వశీ రౌతేల స్టెప్పులు వేయడం జరిగింది. జీ స్టూడియోస్ తో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు.




# ఓంకార్ అన్నయ్య తమ్ముడికి లైన్ క్లియర్

ప్రముఖ యాంకర్ కమ్ డైరెక్టర్ ఓంకార్ సోదరుడు అశ్విన్ బాబు మరో సినిమా తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. హీరోగా చాలా కాలం క్రితమే పరిచయం అయిన అశ్విన్ బాబు కమర్షియల్ బ్రేక్ కోసం వెయిట్ చేస్తున్నాడు. అయినా కూడా అదృష్టం కొద్ది అశ్విన్ కు హీరోగా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా అనీల్ కన్నెగంటి దర్శకత్వంలో అశ్విన్ బాబు హీరోగా 'హిడింభ' అనే సినిమా రూపొందింది. ఇప్పటికే ఈ సినిమా విడుదల కావాల్సి ఉన్నా కూడా కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయ్యింది. అంతే కాకుండా ఇటీవల ఈ సినిమా యొక్క సెన్సార్ కార్యక్రమాలకు అధిక హింస ఇబ్బందిగా మారింది. సెన్సార్ బోర్డ్ క్లియరెన్స్ కి నో చెప్పింది. సెన్సార్ రివ్యూ కమిటీ ముందుకు హిడింభ సినిమా వెళ్లింది. అక్కడ సినిమాకు కొన్ని కట్స్.. ఇంకా మ్యూట్ పెట్టి సెన్సార్ క్లియరెన్స్ ఇవ్వడం జరిగింది. దాంతో సినిమాను ఈనెల 20వ తారీకున విడుదల చేయడం కన్ఫర్మ్ అయ్యింది. సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి కాకపోవడంతో నిన్నటి వరకు సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని అంతా భావించారు. సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి అయిన నేపథ్యంలో హిడింభ సినిమా ప్రమోషన్ కార్యక్రమాల స్పీడ్ పెంచారు. ఏజెంట్ సినిమా నిర్మాత అనిల్ సుంకర ఈ సినిమాను సమర్పించడం తో ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమా కథ చాలా విభిన్నంగా ఉంటుందని.. రెండు టైమ్ లైన్స్ లో సినిమా కథ సాగుతుందని ట్రైలర్ ను చూస్తే అర్థం అవుతుంది. ట్రైలర్ తో సినిమా పై అంచనాలు పెంచడం లో సఫలం అయిన మేకర్స్ విడుదల తర్వాత ఎలాంటి ఫలితాన్ని సాధిస్తారో చూడాలి. హీరోగా అశ్విన్ బాబుకు ఈ సినిమా అత్యంత కీలకం. ఇక ఈ సినిమా లో హీరోయిన్ గా నందితా శ్వేత నటించగా వికాస్ బాడిసా సంగీతాన్ని అందించాడు.




# "గేమ్ ఛేంజర్" డైరెక్టర్ రూమర్స్ పై క్లారిటీ.!




గ్లోబల్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బాలీవుడ్ యంగ్ హీరోయిన్ కియార అద్వానీ హీరోయిన్ గా సెన్సేషనల్ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "గేమ్ ఛేంజర్" కోసం అందరికీ తెలిసిందే. మరి మంచి అంచనాలు ఉన్న ఈ సినిమా కొత్త షెడ్యూల్ అయితే ఈవారం నుంచి స్టార్ట్ కానుండగా లేటెస్ట్ గా అయితే పలు ఇంట్రెస్టింగ్ రూమర్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. మామూలుగా ఈ సినిమాకి ప్రతి అంశాన్ని శంకర్ దగ్గరుండి చూసుకుంటారు అని తెలిసిందే. అయితే లేటెస్ట్ గా యంగ్ దర్శకుడు శైలేష్ కొలను యాడ్ అయ్యి పలు సన్నివేశాలు తెరకెక్కించాడు అని టాక్ వైరల్ గా మారింది. శంకర్ సినిమాని వేరే వాళ్ళు దర్శకత్వం వహించడం ఏంటి అనేది వైరల్ గా అయ్యింది. అయితే దీనిపై క్లారిటీ తెలుస్తోంది. శైలేష్ గేమ్ ఛేంజర్ కి సంబంధించిన కొన్ని చిన్న చిన్న ప్యాచ్ వర్క్ మాత్రమే చూస్కున్నాడట. నటుడు రఘుబాబు తదితర కొందరు కారెక్టర్ ఆర్టిస్ట్ లపై సన్నివేశాలు మాత్రమే చేసాడు. అని అంతే తప్ప సినిమాలో హీరోపై కానీ ఏ ప్రముఖ సీక్వెన్స్ లను అయితే తాను డైరెక్ట్ చెయ్యలేదు అని తెలుస్తోంది.

# రాజమౌళి సినిమాను మించి 'సలార్'...!



టాలీవుడ్ జక్కన్న రాజమౌళి బాహుబలి రెండు భాగాలు.. ఆర్ఆర్ఆర్ సినిమా లతో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల ను నెలకొల్పిన విషయం తెల్సిందే. ముఖ్యంగా బాహుబలి 2 టాప్ చిత్రంగా ఇప్పటికి ఉంది. ఆ చిత్రం కలెక్షన్స్ ను బీట్ చేయడం హిందీ సినిమాల చేతనవ్వడం లేదు.. అలాగే సౌత్ సినిమాల కు కూడా సాధ్యం అవ్వడం లేదు. కనీసం ఆర్ఆర్ఆర్ కి కూడా బాహుబలి 2 రికార్డ్ ని బ్రేక్ చేయడం సాధ్యం కాలేదు. ఆర్ఆర్ఆర్ సినిమా వెయ్యి కోట్ల కు పైగా వసూళ్లు చేసింది. బాహుబలి సినిమా వసూళ్ల నేపథ్యం లో ఆర్ఆర్ఆర్ సినిమా భారీగా ప్రీ రిలీజ్ బిజినెస్ చేసింది. ఇప్పుడు ఆ మొత్తం ను క్రాస్ చేసి మరీ సలార్ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ చేయబోతుంది అనే వార్తలు మీడియా సర్కిల్స్ లో మరియు ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. సలార్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ గత చిత్రం కేజీఎఫ్ 2 వెయ్యి కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇక ప్రభాస్ పాన్ ఇండియా స్టార్ అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీరిద్దరి కాంబో లో రాబోతున్న సలార్ సినిమా కచ్చితంగా వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు నమోదు చేస్తుందనే నమ్మకం అందరి లో వ్యక్తం అవుతోంది. సలార్ మొదటి భాగం పై ఉన్న అంచనాల నేపథ్యం లో నిర్మాతలు భారీ మొత్తాలకు సినిమా థియేట్రికల్ రైట్స్ ను అమ్మాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం అన్ని ఏరియాల్లో కూడా ఆర్ఆర్ఆర్ సినిమా కంటే కొంత మొత్తం ఎక్కువకే నిర్మాతలు అమ్మాలని నిర్ణయించుకున్నారట. ప్రభాస్ గత చిత్రాల ఫలితాలతో సంబంధం లేకుండా సలార్ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ ఆకాశాన్ని అంటుతుందని బయ్యర్లు మాట్లాడుకుంటున్నారు. ప్రశాంత్ నీల్ పై ఉన్న నమ్మకంతో సలార్ ని భారీ మొత్తానికి కొనుగోలు చేసేందుకు సిద్ధం అన్నట్లుగా ఉన్నారు. ప్రీ రిలీజ్ బిజినెస్ లో ఆర్ఆర్ఆర్ ను క్రాస్ చేయబోతున్న సలార్.. రిలీజ్ తర్వాత వసూళ్ల విషయం లో కూడా ఆ సినిమాను క్రాస్ చేస్తుందా అనేది చూడాలి.

# సమంత అలా ఎందుకు పోస్ట్ చేసింది?



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంతా దశాబ్దకాలం పాటు స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పింది. తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది. ఇప్పటికి స్టార్ హీరోయిన్ రేంజ్ లోనే ఆమె హవా కొనసాగుతోంది. అయితే గతం లో మాదిరిగా కాకుండా ప్రస్తుతం ఆమె ఫోకస్ అంతా బాలీవుడ్ చిత్రాల పైన ఎక్కువ ఉంది. అది కూడా డిజిటల్ స్పేస్ లో తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకోవాల ని అనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు లో విజయ్ దేవరకొండకి జోడీ గా ఖుషి మూవీ లో నటిస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ మూవీ షూటింగ్ ఫైనల్ స్టేజ్ లో ఉంది. ప్రస్తుతం ప్యాచ్ వర్క్ జరుగుతుందని తెలుస్తోంది. తాజాగా ఈ అమ్మడు ఇన్ స్టాగ్రామ్ లో క్యార్ వ్యాన్ లైఫ్ ఇంకా మూడు రోజులు మాత్రమే అని పోస్ట్ పెట్టింది. ఈ పోస్ట్ సోషల్ మీడియా లో విపరీతంగా వైరల్ అయ్యింది. అలాగే మరో పోస్ట్ లో సెల్ఫీ షేర్ చేసి ఆరు నెలల నుంచి చాలా కష్టతరంగా ఉందని. అయితే ఫైనల్ గా పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది అంటూ చెప్పుకొచ్చారు. ఖుషి మూవీ కంప్లీట్ చేస్తున్న సమంత మరో వైపు సిటాడెల్ ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ కి కూడా వర్క్ చేస్తోంది. రీసెంట్ గా సెర్బియా లో ఈ వెబ్ సిరీస్ షూటింగ్ జరిగింది. ఇప్పుడు సినిమాల కి కొంతకాలం బ్రేక్ ఇచ్చి కంప్లీట్ గా విశ్రాంతి తీసుకోవాల ని సమంత భావిస్తుందని తెలుస్తోంది. అయితే ఇది పర్మినెంట్ కాదంట. ఒక ఏడాది పాటు పూర్తిగా ఆరోగ్యం పై దృష్టి పెట్టి మయోసైటిస్ నుంచి రికవరీ అయ్యే పని లో సామ్ ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల నుంచి వినిపిస్తోంది. అయితే ఖుషి సినిమా కోసం ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూలు మాత్రం ఇవ్వనున్నట్లు టాక్. నేరుగా ఈ సినిమా ప్రమోషన్ ఈవెంట్స్ లో పార్టిసిపేట్ చేసే అవకాశం ఉండకపోవచ్చు. అయితే సోషల్ మీడియా ద్వారా యాక్టివ్ గా ఉంటూ ఖుషి సినిమా ప్రమోషన్స్ యాక్టివిటీస్ లో కూడా ఇంటర్వ్యూల ద్వారా భాగామయ్యే ప్రయత్నం సమంత చేయనున్న నేపథ్యం లో ఆమె ఫ్యాన్స్ కి కొంత ఊరటని కలగొచ్చు అని భావిస్తున్నారు.

# "గాండీవధారి అర్జున" ప్రీటీజర్ కి డేట్, టైం ఫిక్స్.!

మెగా యంగ్ హీరో వరుణ్ తేజ్ హీరోగా సాక్షి వైద్య హీరోయిన్ గా టాలెంటెడ్ ఫిల్మ్ మేకర్ ప్రవీణ్ సత్తారు తెరకెక్కిస్తున్న సాలిడ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం "గాండీవధారి అర్జున" కోసం తెలిసిందే. మరి మంచి బజ్ ఉన్న ఈ చిత్రం షూటింగ్ అంతా కంప్లీట్ చేసుకొని రిలీజ్ కి సిద్ధంగా ఉండగా ఇక ఈ సినిమా ప్రీ టీజర్ పై అయితే మేకర్స్ ఇప్పుడు అప్డేట్ అందించారు. ఈ సినిమా ప్రీ టీజర్ ని రేపు జూలై 12న ఉదయం 10 గంటల 8 నిమిషాలకి అయితే రిలీజ్ చేస్తున్నట్టుగా వరుణ్ తేజ్ పై ఇంట్రెస్టింగ్ పోస్టర్ తో రివీల్ చేశారు. మరి ఈ సినిమాతో ఓ యాక్షన్ థ్రిల్ రైడ్ ని ప్రామిస్ చేసిన మేకర్స్ ఈ టీజర్ తో మరింత బజ్ ని తీసుకొస్తారేమో చూడాలి. ఇక ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తుండగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర వారు నిర్మాణం వహిస్తున్న ఈ చిత్రం ఈ ఆగస్ట్ 25న గ్రాండ్ గా రిలీజ్ కాబోతుంది.



"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేద్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

మాస్టర్ కీ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై ఫూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989